


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 143 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 4 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 143 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 4 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం


**2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు.**

- టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ
- తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచమంతా ధరించేలా చేస్తామన్న రేవంత్
- సినిమా పరిశ్రమ అవసరాలను స్థానికంగా తీర్చేలా ప్రోత్సాహం
- నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు.హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.





# కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త...

## సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక

- కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో జాగ్రత్తగా ఉండాలని సజ్జనార్ హెచ్చరిక
- కాల్షియం కార్బైడ్ వాడకం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలని వెల్లడి
- సహజ, కల్తీ పండ్ల మధ్య తేడాలను గుర్తించాలని ప్రజలకు సూచన
- కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతున్నామన్న హైదరాబాద్ పోలీసులు
- సమాచారం ఉంటే డయల్ 100 లేదా హెచ్-ఫాస్ట్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి

మిగతా 2లో



# లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు

- గిరిజన రిజర్వేషన్లను పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్న హరీశ్
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం జరుగుతోందని మండిపాటు
- రాష్ట్ర సమస్యలను రేవంత్ గాలికి వదిలేశారని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి,

మిగతా 2లో




# స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

- వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ
- ప్రైవేటుగా అభివృద్ధి చేసిన తియాన్‌లాంగ్3 ప్రయోగం
- సాంకేతిక లోపం కారణంగా నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లో విఫలం

మిగతా 2లో

# తెలంగాణలో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

- గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, జనగామ జిల్లాల్లో వర్షాలు



మిగతా 2లో

# కొండాపూర్ పబ్‌పై ఈగల్ టీమ్ దాడులు .. 8 మందికి డ్రగ్స్ పాజిటివ్..

- క్వాక్ ఎరీనా పబ్‌పై పోలీసుల దాడి
- 64 మందికి అక్కడికక్కడే పరీక్షలు
- ఆ సమయంలో పబ్‌లోనే ఉన్న హేమ
- నటి హేమకి టెస్ట్‌లు..
- డ్రగ్స్ టెస్టులో తనకు నెగెటివ్ వచ్చిందని వెల్లడి

మిగతా 2లో






# బీఆర్ఎస్ క్లోజ్... ఆ పార్టీ రోడ్డున పడింది

- రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీనే నమ్ముతున్నారన్న మహేశ్ గౌడ్
- కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని వ్యాఖ్య
- బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని విమర్శ

మిగతా 2లో

# మరింత చమురు కావాలా... మేం సరఫరా చేస్తాం!

## భారత్‌కు రష్యా ఓపెన్ ఆఫర్



- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత్‌కు రష్యా కీలక ఆఫర్
- చమురు, ఎల్‌ఎన్‌జీ సరఫరాను పెంచేందుకు సిద్ధమని వెల్లడి
- రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ భారత పర్యటనలో చర్చలు
- ఇటీవల తగ్గిన దిగుమతులు మళ్లీ పెరిగే అవకాశం
- భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇచ్చే పరిణామం

**హైదరాబాద్ పెన్ పవర్::**పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్న వేళ, భారత్‌కు రష్యా కీలకమైన ప్రతిపాదన చేసింది. దేశీయ అవసరాల కోసం క్రూడ్ ఆయిల్, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్ జీ) సరఫరాను మరింత పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. భారత పర్యటనలో ఉన్న రష్యా మొదటి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా

మిగతా 2లో



# పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే మీరా మాకు నీతులు చెప్పేది?

## రేవంత్ రెడ్డిపై కేరళ సీఎం విజయన్ ఫైర్

- కేరళలో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం
- కేరళ సర్కారుపై విమర్శలు
- రేవంత్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవన్న సీఎం పినరయి విజయన్
- వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు
- అభివృద్ధి నిరోధకులకు రేవంత్ రెడ్డి ఒక గొంతుకలా మారారని విమర్శలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేరళలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర సర్కారుపై

మిగతా 2లో

# ఇరాన్ గడ్డపై కూలిన ఎఫ్-35...

## పైలట్ ను కాపాడేందుకు అమెరికా విఫలయత్నాలు?

- ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-35 పైలట్ కోసం అమెరికా గాలింపు
- బ్లాక్ హాక్ హెలికాప్టర్లతో వెదుకులాట.. విఫలమైన ప్రయత్నాలు
- అమెరికా పైలట్‌ను ఇరాన్ దళాలు అదుపులోకి తీసుకున్నట్టు కథనాలు
- రెండో అమెరికా ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్టు ప్రకటించిన ఇరాన్
- గత వారం కూడా ఎఫ్-16, డ్రోన్‌ను కూల్చివేసినట్లు తెలిపిన ఐఆర్‌జీసీ

మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## అమెరికా అడుగుపెట్టేది ఇక్కడే!

ఇరాన్ గడ్డపై అమెరికా సైనికులు అడుగుపెట్టడం దాదాపుగా ఖరారైంది. ఈ నెల 6వ తేదీతో ముగిసే యుద్ధ విరామం గడువు పొడగింపు అవుతుందా లేదా అన్నది అమెరికా సైనికుల మోహరింపుపై ఆధారపడి ఉన్నది. మోహరింపు పూర్తయి.. యుద్ధానికి పూర్తిగా సన్నద్ధం అయితే విరామం గడువు పొడగింపు ఉండదు. మిత్రదేశాలు లేదా ఇతర ఏర్పాట్లకు సమయం అవసరమైతేనే పొడగింపు ఉండనున్నది. అందుకే ఇరాన్ కూడా చర్చలు జరగడం లేదు.. కేవలం సందేశాలను మాత్రమే వింటున్నామని ప్రకటించింది. అదేసమయంలో ఇరాన్ కూడా ప్రపంచంపై ఒత్తిడి పెంచేందుకు సాధ్యమైనంత వరకు అమెరికా దళాలు ఇరాన్ లోకి అడుగుపెట్టకుండా చూసుకోవడంతోపాటు హోర్ముజ్‌పై పట్టు కొనసాగించి యుద్ధాన్ని మరింత కాలం పొడిగించడమే టార్గెట్‌గా పెట్టుకున్నది. చమురు అందకపోతే చాలా దేశాలకు ముఖ్యంగా భారత్, చైనా, యూరప్ దేశాలకు ఊపిరి ఆగిపోయినట్టే అవుతుంది. అందుకే ప్రపంచం ఒత్తిడి పెంచితే అది అమెరికాపై ప్రభావం చూపుతుందని ఇరాన్ ప్లాన్. అప్పుడు ఇరాన్ పెట్టే షరతులకు అమెరికా అంగీకరించాల్సి వస్తుంది. ఆ టైమ్ వరకు యుద్ధాన్ని పొడగించాలని ఇరాన్ అనుకుంటున్నది. అయితే, అమెరికా దళాలు భూతల దాడులకు (గ్రౌండ్ ఇన్వేషన్)కి దాదాపు సిద్ధమైనట్టు తెలుస్తున్నందున వారు ఎక్కడనుంచి ఇరాన్ లోకి అడుగుపెడతారన్నది ఇప్పుడు అందరిలోనూ మెదులుతున్న సందేహం.. అమెరికా ఇరాన్‌పై గ్రౌండ్ ఇన్వేషన్ ప్రారంభించాలనుకుంటే, ప్రధానంగా మూడు వైపుల నుండి జరిగే అవకాశం ఉంది. దక్షిణాన పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ తీర ప్రాంతాల నుండి ఉభయచర దాడుల ద్వారా బందర్ అబ్బాస్, చాబహార్ వంటి కీలక ఓడరేవులను లక్ష్యం చేసుకోవచ్చు. పశ్చిమాన ఇరాక్ సరిహద్దుల నుండి, తూర్పున ఆఫ్ఘనిస్తాన్ లేదా పాకిస్తాన్ సరిహద్దుల వద్ద ఉన్న అమెరికా అనుకూల స్థావరాల నుండి కూడా చొచ్చుకు రావొచ్చు. అయితే, ఇరాన్ భౌగోళికం చాలా క్లిష్టమైనది. జగ్రోస్ పర్వత శ్రేణులు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయి. కాబట్టి అమెరికా తన దాడులను టెహ్రాన్ వరకు తీసుకెళ్లకుండా, కేవలం చమురు నిల్వలున్న ఖర్గ్ ఐలాండ్, బుషెహర్ అణు ప్లాంట్‌తోపాటు దక్షిణ తీర ప్రాంతాల నియంత్రణకే పరిమితం చేసే అవకాశం ఉంది. పూర్తిస్థాయి ఆక్రమణ కంటే ఇరాన్ ఆర్థిక, సైనిక వెన్నెముకను విరిచేలా ఈ 'లిమిటెడ్ గ్రౌండ్ ఆపరేషన్' సాగవచ్చు. ఈ స్థాయి యుద్ధానికి అమెరికాకు అయ్యే ఖర్చు ఊహాతీతం. ఇరాక్, అఫ్ఘానిస్తాన్ యుద్ధాల అనుభవాలను బట్టి చూస్తే, ఇరాన్ వంటి పటిష్టమైన సైన్యం ఉన్న దేశంతో యుద్ధానికి ప్రాథమికంగానే 2 నుండి 3 ట్రిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. అమెరికా ఇందులో ఎం1 అబ్రమ్స్ ట్యాంకులు, బ్రాడ్లీ ఫైటింగ్ వెహికల్స్, స్ట్రైకర్ ఆర్మ్డ్ వెహికల్స్ మరియు వేల సంఖ్యలో హమ్వీలను వినియోగిస్తుంది. వీటికి అదనంగా గాలిలో ఆధిపత్యం కోసం ఎఫ్-35, ఎఫ్-22 స్టెల్త్ విమానాలతోపాటు భూగర్భ బంకర్లను ఛేదించే 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (ఓూంః) వంటి శక్తివంతమైన ఆయుధాలను వాడుతున్నది. కేవలం ఆయుధాలకే కాకుండా, లక్షలాది మంది సైనికులకు అవసరమైన లాజిస్టిక్స్, ఇంధనం మరియు వైద్య సహాయం కోసం రోజుకు వందల కోట్ల రూపాయల వ్యయం చేయాల్సి ఉంటుంది. నిజానికి యుద్ధ సమయాల్లో ఒక్కో సైనికుడికి జీతాలతోపాటు అతడికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఏడాదికి దాదాపు ఒక మిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే 3ట్రిలియన్ల అప్పుల్లో ఉన్న అమెరికాకు ఇది ఊహించని షాక్ లాంటిది. యుద్ధం పొడగిస్తే మాత్రం అమెరికా మరో ఐదేళ్లపాటు ద్రవ్యోల్బణంలో మునిగిపోతుంది.

రాజ్యాంగపరంగా చూస్తే అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఆమోదం లేకుండా అధ్యక్షుడు పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించలేరు. అయితే, 'వార్ పవర్స్ యాక్ట్ (1973)' ప్రకారం, అమెరికా భద్రతకు ముప్పు ఉందనే నెపంతో అధ్యక్షుడు కాంగ్రెస్ అనుమతి లేకుండానే 60 నుంచి గరిష్ఠంగా 90 రోజుల పాటు సైనిక చర్యకు ఆదేశించవచ్చు. ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో ఇరాన్‌పై కఠిన చర్యలకు మొగ్గు ఉన్నప్పటికీ, గ్రౌండ్ ఇన్వేషన్‌కు పూర్తి స్థాయిలో ఆమోదం లభించడం కష్టం. అధ్యక్షుడు తనకున్న 'ఆర్టికల్ 2' అధికారాలను ఉపయోగించి 'పరిమిత దాడులు' లేదా 'డిఫెన్సివ్ యాక్షన్' పేరుతో సైన్యాన్ని పంపవచ్చు. సాధారణంగా ఇలాంటి కీలక దాడులకు ముందు కాంగ్రెస్ ఆథరైజేషన్ ఆఫ్ యూజ్ ఆఫ్ మిలిటరీ ఫోర్స్ (ఏయూఎంఎఫ్) అనే తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంటుంది, దీనికి సంబంధించి చర్చలు ప్రస్తుతం వాషింగ్టన్‌లో అంతర్గతంగా జరుగుతున్నాయి, కానీ అధికారిక ఆమోదం రావడానికి మరికొన్ని వారాలు పట్టవచ్చు. హౌతీలు బాబ్ ఎల్-మండేబ్‌ను బ్లాక్ చేస్తే ప్రపంచ వాణిజ్యం స్తంభిస్తుంది. ఎర్ర సముద్రం ద్వారా యూరప్, ఆసియా మధ్య జరిగే 12% వాణిజ్యం ఆగిపోతుంది. దీనివల్ల వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆహారంతోపాటు ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతాయి. అన్నిటికంటే ప్రమాదకరమైనది ఏమిటంటే, ఆ సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్. ఒకవేళ హౌతీలు వీటిని ధ్వంసం చేస్తే, ఆసియా- యూరప్ మధ్య డిజిటల్ కనెక్షన్ కట్ అయ్యి బ్యాంకింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమవుతాయి. ఇది కేవలం ఒక యుద్ధం కాదు, గ్లోబల్ ఎకానమీకి ఒక 'బ్లాక్ హోల్'లా మారుతుంది. ఒకవేళ మండేబ్ పూర్తిగా బ్లాక్ అయితే, అమెరికా తన మిత్రదేశాలతో కలిసి యెమెన్‌పై కూడా పరిమిత భూతల దాడికి దిగే ప్రమాదం ఉంది. ఇది యుద్ధాన్ని మరింత సంక్లిష్టంగా మార్చి, మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులు కూడా లేకపోలేదు. అంతిమంగా యుద్ధం చర్చలతోనే ముగిసిపోతే ఆర్థికవ్యవస్థలు చావు అంచుకువెళ్లి వచ్చినంత ఊరటనిస్తుంది.. పొరపాటు నిర్ణయాలు తీసుకుంటే చరిత్ర వారిని దోషులుగా నిలబెడుతుందన్నది వాస్తవం.

# పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే మీరా మాకు నీతులు చెప్పేది?

- మొదటి పేజి తరువాయి

చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సొంత రాష్ట్రంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే వ్యక్తి, సామాజిక పురోగతి గురించి కేరళకు పాఠాలు చెప్పడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేరళ సాధిస్తున్న సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని దెబ్బతీయాలనుకునే వారికి రేవంత్ రెడ్డి ఒక గొంతుకగా మారారని విజయన్ ఆరోపించారు. కేరళలో అవినీతి, దుష్పరిపాలన ఉందని ఆరోపించే ముందు రేవంత్ రెడ్డి అధికారిక గణాంకాలను పరిశీలించాలని పినరయి విజయన్ సూచించారు. "దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని ఆయనకు తెలియదా? నీతి ఆయోగ్ ఎస్‌డీజీ ఇండెక్స్ (2023-24)లో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. మీ రాష్ట్రంలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కేరళను కించపరచడం చాలా విచారకరం" అని విజయన్ అన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారమే కేరళలో పేదరికపు రేటు కేవలం 0.55 శాతం అని, ఇది దేశంలోనే అత్యల్పమని గుర్తుచేశారు. 2025 చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలవబోతోందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణలో పేదరికం 5.88 శాతంగా ఉందని, అక్కడి నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు.

అంతేకాకుండా, కేరళలో అక్షరాస్యత 95.3 శాతం ఉండగా, తెలంగాణలో 76.9 శాతం వద్దే ఆగిపోయిందని విజయన్ చురకలంటించారు. కేరళలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) కేవలం 5గా ఉందని, ఇది అమెరికా (5.6) కన్నా మెరుగని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో ఈ రేటు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనా నమూనాను రేవంత్ రెడ్డి విమర్శించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

"2025 సెప్టెంబర్ 1న, తెలంగాణకు చెందిన రెవెన్యూ, సర్వే ఉన్నతాధికారుల బృందం తిరువనంతపురం వచ్చి మా డిజిటల్ ల్యాండ్ రికార్డ్ సిస్టమ్ 'ఎంతే భూమి'ని అధ్యయనం చేసింది. ఒకవైపు మీ అధికారులు మా నమూనాను నేర్చుకోవడానికి వస్తుంటే, మరోవైపు

మీరు బహిరంగంగా ఎగతాళి చేయడం ఎంతవరకు సమంజసం?" అని రేవంత్ రెడ్డిని విజయన్ ప్రశ్నించారు.

కేరళ, కేంద్ర ప్రభుత్వాల మధ్య లాలూచీ ఉందని రేవంత్ చేసిన ఆరోపణను విజయన్ కొట్టిపారేశారు. కేరళ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం విధిస్తున్న ఆర్థిక ఆంక్షలపై, అప్పుల పరిమితిపై ఒక్క మాట కూడా మాట్లాడని కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి నిజమైన 'బీ-టీమ్' అని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు పదేపదే ఆలస్యం చేసే ప్రభుత్వం నడుపుతున్న ముఖ్యమంత్రి, కేరళకు నేర్పడానికి ఏమీ లేదని అన్నారు. పాలన, ప్రజా సంక్షేమం గురించి నిజమైన పాఠాలు నేర్చుకోవాలంటే తెలంగాణ ముఖ్యమంత్రిని కేరళకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని పినరయి విజయన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణలో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ

జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ క్లోజ్... ఆ పార్టీ రోడ్డున పడింది

తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు

దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం" అని ఆయన జోస్యం చెప్పారు.

# కొండాపూర్ పబ్‌పై ఈగల్ టీమ్ దాడులు .. 8 మందికి డ్రగ్స్ పాజిటివ్..

నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొండాపూర్‌లోని 'క్వాక్ ఏరీనా పబ్'పై ఈగల్ టీమ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలు పబ్‌లో ఉన్నవారందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి.పబ్‌లో పార్టీ జరుగుతున్న సమయంలో ఎంట్రీ ఇచ్చిన పోలీసులు, అనుమానం ఉన్న సుమారు 64 మందికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం 8 మందికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ అని తేలింది. వీరిలో ఆరుగురు గంజాయి సేవించగా, మరో ఇద్దరు ఇతర రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే నిందితులందరినీ అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పార్టీలో టాలీవుడ్ సీనియర్ నటి హేమ కూడా పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. పబ్‌పై దాడి జరిగిన సమయంలో ఆమె అక్కడ ఉండటంతో రకరకాల ప్రచారాలు జరిగాయి. దీనిపై ఆమె తక్షణమే స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను

విడుదల చేశారు. "నాకు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చింది. నేను ఏ తప్పూ చేయలేదు. దయచేసి నాపై అనవసరంగా దుష్ప్రచారం చేయవద్దు" అని ఆమె ఆ వీడియోలో స్పష్టం చేశారు. మరోవైపు, నగరంలోని పబ్‌ల యజమానులు నిబంధనలు అతిక్రమించినా, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పబ్‌లలో సీసీ కెమెరాల నిఘాతో పాటు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

# కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త...

వేసవి వచ్చిందంటే చాలు, పండ్లలో రారాజైన మామిడి పండ్ల కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, మార్కెట్లో కంటికి ఇంపుగా కనిపించే ఈ పండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు కీలక సూచనలు చేశారు.కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, కేవలం కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా కాకుండా, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన నిగనిగలాడుతూ, ఒకే రకమైన పసుపు పచ్చ రంగులో ఆకర్షణీయంగా కనిపించే పండ్లను చూసి మోసపోవద్దని సూచించారు. సహజంగా పండిన పండు అన్నిచోట్లా ఒకే రంగులో ఉండదని, కానీ రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండు పైన పసుపుగా ఉన్నా లోపల పచ్చిగా, రుచిహీనంగా ఉంటుందని వివరించారు. ఇలాంటి కల్తీ పండ్లను తినడం ప్రాణాంతకం కాగలదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. వీటిని తినడం వల్ల తక్షణమే గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ రసాయనాలు శరీరంలోకి చేరడం వల్ల దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తవచ్చని వివరించారు.ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కల్తీ వ్యాపారాలపై హైదరాబాద్ పోలీస్ విభాగం ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల రూపాన్ని చూసి కాకుండా, సహజత్వాన్ని గమనించి కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసాధారణ రంగు, రసాయన వాసన, వింత రుచి ఉన్న పండ్లకు దూరంగా ఉండాలన్నారు.

ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, హెచ్-ఫాస్ట్ వాట్సాప్ నంబర్ 8712661212కు గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

# లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు

- మొదటి పేజి తరువాయి

కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

# ఇరాన్ గడ్డపై కూలిన ఎఫ్-35...

ఇరాన్ గగనతలంలో తమ ఎఫ్-35 ఫైటర్ జెట్ కూలిపోవడంతో, అందులోని పైలట్‌ను కాపాడేందుకు అమెరికా ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ఇరాన్ మీడియా సంస్థ తస్నీమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. పశ్చిమ ఇరాన్‌లోని కోగిలుయే, బోయర్-అహ్మద్ ప్రావిన్సులలో అమెరికా దళాలు శుక్రవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపింది. బ్లాక్ హాక్ హెలికాప్టర్లు, సీ-130 హెర్క్యులస్ విమానాలతో గాలిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు వారి ప్రయత్నాలు ఫలించలేదని ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. సెంట్రల్ ఇరాన్‌లో తమ అధునాతన రక్షణ వ్యవస్థతో అమెరికాకు చెందిన రెండో ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) శుక్రవారం ప్రకటించింది. లేకెన్‌హీత్ స్క్వాడ్రన్‌కు చెందిన ఈ యుద్ధ విమానం పూర్తిగా ధ్వంసమై కూలిపోయిందని తెలిపింది. అయితే, దాడి నుంచి తప్పించుకున్న పైలట్ పారాచూట్ సాయంతో ఇరాన్ భూభాగంలోనే ల్యాండ్ అయినట్లు సమాచారం. పైలట్ బతికే ఉంటాడని భావిస్తున్న అమెరికా, అతడిని ఇరాన్ సరిహద్దుల నుంచి బయటకు తీసుకురావాలని చూస్తోందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఆ పైలట్‌ను ఇరాన్ సైనిక దళాలు ఇప్పటికే అదుపులోకి తీసుకుని ఉండవచ్చని కొన్ని వర్గాలు చెబుతున్నట్లు తస్నీమ్ తన కథనంలో పేర్కొంది.గత వారం కూడా ఓ అమెరికా ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించడం తెలిసిందే. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తుండగా, ఇరాన్, దాని మిత్రపక్షాలు కూడా మధ్యప్రాచ్యంలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై ప్రతిదాడుల కు దిగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా ఘటన చోటుచేసుకుంది.

# స్పేస్ ఎక్స్ 'ఫాల్కన్9'కు పోటీగా చైనా భారీ రాకెట్ ప్రయోగం... విఫలం

చైనా సొంతంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయోగం విఫలమైంది. దీనితో వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాన్‌లాంగ్-3 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైంది. ఇది నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్లు సంబంధిత సంస్థ తెలిపింది.బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ 'స్పేస్ ఎక్స్' ఫాల్కన్9కు పోటీగా ఈ భారీ రాకెట్‌ను అభివద్ధి చేసింది. దీనిని ఈరోజు డాంగ్‌ఫెంగ్ కమ ర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించగా, నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే విఫలమైంది. ఇది ఫెయిల్ కావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు స్పేస్ పయనీర్ వెల్లడించింది. తదుపరి మిషన్ విజయవంతమయ్యేలా కృషి చేస్తామని తెలిపింది.

# మరింత చమురు కావాలా... మేం సరఫరా చేస్తాం!

- మొదటి పేజి తరువాయి

సీతారామన్‌లతో మంటురోవ్ సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో కూడా భేటీ అయ్యారు. ఈ చర్చల్లో ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారం ప్రధాన అంశంగా నిలిచింది. "భారత మార్కెట్‌కు స్థిరంగా చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాను పెంచే సత్తా తమ కంపెనీలకు ఉంది" అని మంటురోవ్ స్పష్టం చేసినట్లు రష్యా అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవడంతో, ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా సరఫరాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవలి గణాంకాల ప్రకారం, జనవరి 2026లో రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు 19.3 శాతానికి తగ్గాయి. అయితే, ఫిబ్రవరి చివరి నుంచి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత భారత్ మళ్లీ రష్యా నుంచి కొనుగోళ్లను పెంచుతోంది. ఇంధనంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఎరువులు, కనెక్టివిటీ వంటి ఇతర రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించడంపై ఈ సమావేశాల్లో చర్చించారు. గతేడాది భారత్‌కు ఎరువుల సరఫరా 40 శాతం పెంచామని, భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహకరిస్తామని మంటురోవ్ తెలిపారు.రష్యా తాజా ప్రతిపాదన భారత్ ఇంధన భద్రతకు భరోసా ఇవ్వడంతో పాటు, ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# AVN లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్






హైదరాబాద్ పెన్ పవర్: వేడుకలోపలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏవీఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ పాఠశాల ప్రారంభోత్సవ ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, శాస మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. వీరితో పాటు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకట్ రమణా రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజి రెడ్డి ,ఏవీఎన్ స్కూల్ ఫౌండర్ చైర్మన్ ఏవీఎన్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యా రంగంలో నాణ్యమైన విద్య అందించడంపై తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో గ్లోబల్ స్థాయి విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

# తుమ్మిడి కుంట చెరువు పనులను.. ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్ లోని చెరువులకు పునర్వైభవం తీసుకువచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మాదాపూర్‌లోని తుమ్మిడి కుంట చెరువు పునరుద్ధరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైటెక్స్‌లో జరిగిన టెక్స్టైల్ సదస్సులో పాల్గొన్న అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో సీఎం అకస్మాత్తుగా తుమ్మిడి కుంట చెరువును సందర్శించారు. చెరువు చుట్టూ కలియతిరిగిన ఆయన అక్కడ జరుగుతున్న సివిల్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు కీలక వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఒకప్పుడు ఆక్రమణల కారణంగా కేవలం 14 ఎకరాలకు కుంచించుకుపోయిన ఈ చెరువును ప్రభుత్వం కఠిన చర్యలు

-4 లో



# రేవంత్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. మార్పు రావాలి



- కాళేశ్వరం పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్న జీవన్ రెడ్డి
- ప్రాణహిత జలాల విషయంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శ
- భవిష్యత్ రాజకీయాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రారంభమై రెండేళ్లు కాకముందే "ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనపై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ ఇప్పుడు అదే తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వంపై కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకే నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం చేశారని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలే తప్ప, పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణకు కేవలం రూ. 500 కోట్లు ఖర్చవుతాయని, కానీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ నివేదికను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమైందని,

-4 లో

# టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు

- తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదన్న కవిత
- పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని వెల్లడి
- బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర సమితి పేరును ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదని, ఆ పేరును ఎవరైనా ఉపయోగించుకోవచ్చని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత త్వరలో తన రాజకీయ పార్టీని ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి పేరు మీదనే పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని చాలామంది భావించారు. ఆ తర్వాత మరిన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా, ఆమె చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.ఆమె మీడియాతో మాట్లాడుతూ, పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు (టీఆర్ఎస్) ఇప్పుడు ఎవరి సొంతం కాదని గుర్తు చేశారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బీహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. పాతిక సంవత్సరాల క్రితం కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌గా మారిన విషయం తెలిసిందే.



**ప్రైవేటు పాఠశాలల ఫీజులపై విమర్శలు**

రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు.తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లపై ఫీజు నియంత్రణ కమిటీ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలు 8 శాతం నుంచి 10 శాతం పెంచుకోవచ్చని, కానీ 30 నుంచి 35 శాతం పెంచితే ఎలాగని ప్రశ్నించారు.

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

# జీహెచ్ఎంసీకి పెరిగిన ఆదాయం...

- నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా పెరిగిన ఆదాయం
- రూ.1,172 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ వెల్లడి
- అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.36.36 కోట్ల మేర పెరిగిన ఆదాయం

హైదరాబాద్ పెన్ పవర్:2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కు ఆదాయం భారీగా పెరిగింది. మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం పెరిగింది. 'బిల్డ్ నౌ' పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేసింది. క్యూర్ అర్బన్ రీజియన్‌లో రూ.2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, జీహెచ్ఎంసీలో రూ.995.82 కోట్లు, హైదరాబాద్ మున్సిపల్

-4 లో

# రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆర్. కృష్ణయ్య హెచ్చరిక

- ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్
- లేదంటే మంత్రులు, ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టిస్తామన్న ఆర్. కృష్ణయ్య
- సమస్యను పరిష్కరించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు బయట తిరగలేరని హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టిస్తామని రాజ్యసభ సభ్యుడు ఆర్. కష్ణయ్య హెచ్చరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకోకూడదనే దురుద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు.ఈ సమస్యను పరిష్కరించకుంటే మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు బయట తిరగలేరని హెచ్చరించారు. అందరూ రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌పై వందలసార్లు ధర్నాలు, పోరాటాలు చేశామని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థులకు న్యాయం జరగాలని ఫీజురీయింబర్స్‌మెంట్స్ పథకం తీసుకువచ్చారని గుర్తు చేశారు.

# కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం.. విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి

- కేరళలో రేవంత్ రెడ్డి గొప్పలు పలికారన్న కిషన్ రెడ్డి
- బీజేపీపై అక్కడ తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం
- తెలంగాణకు ఏం చేశారని కేరళ వెళ్లి ప్రచారం చేశారని నిలదీత



హైదరాబాద్ పెన్ పవర్:ఆరు గ్యారెంటీల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు పలికారని, ముున్ముందు తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, బీజేపీపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇద్దరు పిల్లలతో భార్య ఆత్మహత్య.. భర్త ఇంటి ముందు శవాల ఖననం

**హైదరాబాద్ పెన్ పవర్:**
భర్త రెండో పెళ్లి చేసుకుని.. తనను హింసిస్తున్నాడని ఓ భార్య.. తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆమె గ్రామస్తులు.. ఆ ముగ్గురు మృతదేహాలను.. భర్త ఇంటి ముందే ఖననం చేయడానికి ప్రయత్నించడంతో.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో ఇద్దరు పిల్లలను ఇంటి ముందు పాతిపెట్టగా.. భార్య మృతదేహాన్ని పొలంలో పాతిపెట్టారు.వరంగల్ జిల్లాలో ఇద్దరు కొడుకులతో ఓ తల్లి ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పెళ్లి అయి ఇద్దరు కొడుకులు ఉన్నప్పటికీ.. రెండో పెళ్లి చేసుకున్న భర్త.. వేధింపులకు గురి చేయడంతో.. భార్య.. ఆ ఇద్దరు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్‌లో జరగ్గా.. భార్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారి మృతదేహాలను భర్త ఇంటి ముందు గొయ్యి తీసి పూడ్చేందుకు ప్రయత్నించడం, దాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడమాణిక్యం తండాకు చెందిన ప్రవీణ్‌కు.. అదే గ్రామానికి చెందిన స్రవంతితో కొన్నేళ్ల క్రితం పెళ్లి అయింది. వీరికి కార్తీక్ (10), కౌశిక్ (8) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కుటుంబం.. హైదరాబాద్ మియాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నా.. అతడి బంధువుల్లో ఉండే ఓ అమ్మాయితో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత స్రవంతిని.. ప్రవీణ్ వేధిస్తుండటంతో.. ఆమె తట్టుకోలేకపోయింది. ఒకవైపు భర్త రెండో పెళ్లి చేసుకోవడం, మరోవైపు వేధింపులకు గురి చేయడంతో తన ఇద్దరు కొడుకులతో కలిసి ఇటీవల మంగళవారం రోజున మియాపూర్‌లో ఆత్మహత్య చేసుకుందిఈ విషయం తెలుసుకున్న స్రవంతి ఫ్యామిలీ హుటాహుటిన.. హైదరాబాద్ వచ్చారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి స్రవంతి, కార్తీక్, కౌశిక్ ముగ్గురు మృతదేహాలను తమ గ్రామానికి తీసుకెళ్లారు. తమ కుమార్తె, పిల్లలు చనిపోవడానికి కారణం ప్రవీణ్ అని స్రవంతి బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆ ముగ్గురు మృతదేహాలకు ప్రవీణ్ ఇంటి ముందే అంత్యక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. ఇక పరిస్థితి తీవ్రంగా మారడంతో.. పోలీసులు రంగంలోకి దిగారు.భర్త ప్రవీణ్ వేధింపుల కారణంగా స్రవంతి తన ఇద్దరు కొడుకులతో ఆత్మహత్య చేసుకోగా.. తీవ్రంగా ఆగ్రహించిన గ్రామస్తులు.. అతడి ఇంటి ముందే వారిని ఖననం చేసే ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవడంతో ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ ఆగ్రహంలో ఉన్న గ్రామస్తులు.. పోలీసులు చెప్పినా వినకుండా ప్రవీణ్ ఇంటి ముందే పిల్లలు కార్తీక్?, కౌశిక్? మృతదేహాలను పాతిపెట్టారు. అయితే స్రవంతి మృతదేహానికి మాత్రం ప్రవీణ్ పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇక ఈ ఘటన తర్వాత ఇంటి ముందు అంత్యక్రియలు ఖననం చేసిన చిన్నారుల మృతదేహాలను గురువారం రోజున పోలీసులు అక్కడి నుంచి తొలగిస్తారనే అనుమానంతో స్రవంతి బంధువులు, గ్రామస్తులు రాత్రంతా అక్కడే కాపు కాశారు. కానీ పోలీసులు అలాంటి ప్రయత్నం చేయకపోవడంతో కాస్త శాంతించారు. మరోవైపు.. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా: కలెక్టర్ రాజర్షి షా

**వినతి పత్రాన్ని అందజే సిన టీ.ఎస్.జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు.**

**అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక.**



**అదిలాబాద్,ఏప్రిల్ :03 పెన్ పవర్:**
తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టీ.ఎస్.జె.యు)జిల్లా నూతనంగా ఎన్నుకోబ డిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న,ఉపాధ్య క్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ సందర్భంగా యూని యన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్య లను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసు పత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా చూడాలని,అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసింది గా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరు గుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారా నికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు.యూనియన్ కోశాధికారి అమృత్,ఒకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షు లు నరేష్ కదం,సహాయ కార్యదర్శి ఆర్కసంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎముర్లవార్,అనిల్ పవర్,అడ్డిగం మోహన్,శంకర్ తదితరులు ఉన్నారు.

# నిజామాబాద్ లో లవ్ స్టోరీ... వరుడు గ్రేట్ శాక్రిఫైజ్

**నిజామాబాద్, ఏప్రిల్ 3 పెన్ పవర్:**
నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని ఆ కళ్యాణ మండపం పెళ్లి సందడితో కళకళలాడుతోంది. బంధుమిత్రుల కోలాహలం, మంగళ వాయిద్యాల హోరు మధ్య వధువు పల్లవి , వరుడు వేణుగోపాల్ పెళ్లి పీటల మీద కూర్చున్నారు. పండితులు మంత్రోచ్ఛారణలు చేస్తూ పెళ్లి తంతును నడిపిస్తున్నారు. జీలకర్ర బెల్లం కార్యక్రమం పూర్తయ్యింది. ఇక ప్రధాన ఘట్టమైన మాంగల్య ధారణ సమయం రానే వచ్చింది. పెళ్లికొడుకు వేణుగోపాల్ చిరునవ్వుతో తాళిని పల్లవి మెడలో కట్టబోయాడు.సరిగ్గా అదే క్షణంలో.. కాలం ఆగిపోయినట్లుగా పల్లవి ఒక్కసారిగా వద్దు.. ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు! అని గట్టిగా అరిచింది. ఆ ఒక్క మాటతో పెళ్లి పందిరంతా నిశ్శబ్దం అలుముకుంది. అప్పటివరకు సంతోషంగా ఉన్న బంధువుల ముఖాల్లో ఒక్కసారిగా ఆందోళన, అయోమయం నెలకొన్నాయి. పల్లవి కన్నీళ్లతో తన మనసులోని నిజాన్ని అందరి ముందూ బయటపెట్టింది. తాను వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమిస్తున్నానని, ఇంట్లో చెబితే ఎక్కడ ఒప్పుకోరో అన్న భయంతో ఇంతకాలం మౌనంగా ఉన్నానని నిజాయితీగా ఒప్పేసుకుంది.ఈ మాట వినగానే పల్లవి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే పరువు పోతుంది, కాపురం మొదలుపెట్టాక అంతా సర్దుకుంటుంది అని నచ్చజెప్పారు. కానీ పల్లవి
58తన నిర్ణయానికి కట్టుబడింది. తనని ప్రేమించిన వాడికి కాకుండా మరొకరికి భార్యగా కాలేనని తెగేసి చెప్పింది. పరువు కోసం ఒక నిరర్థకమైన బంధంలో బందీ కావడానికి ఆమె నిరాకరించింది.అక్కడ అందరూ ఆశ్చర్యపోయే మరో దృశ్యం ఆవిష్కృతమైంది. తన మెడలో తాళి కట్టాల్సిన అమ్మాయి అలా చెప్పడంతో సాధారణంగా ఏ వరుడైనా అవమానంగా

భావించి గొడవ చేస్తాడు. కానీ వేణుగోపాల్ సంస్కారం ముందు అందరూ తలవంచాల్సిందే. పల్లవి బాధను, ఆమె నిజాయితీని అతను అర్థం చేసుకున్నాడు. నాపై ప్రేమ లేని అమ్మాయిని బలవంతంగా పెళ్లి చేసుకొని, ఇద్దరి జీవితాలను నాశనం చేయడం నాకు ఇష్టం లేదు. ఆమె ఇష్టాన్నే నేను గౌరవిస్తాను అని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఘటన సినిమాల్లో వచ్చే క్లైమాక్స్ లా అనిపించినా, వేణుగోపాల్ చూపించిన ఆ పరిణతికి అక్కడున్న వారంతా ఫిదా అయిపోయారు. ఆ గొడవలో ఆమెను విమర్శించకుండా, ఒక ప్రాణం విలువ తెలిసిన మనిషిగా అతను పెళ్లి రద్దుకు అంగీకరించాడు. చివరికి బంధువులు కూడా చేసేదేమీ లేక పెళ్లిని రద్దు చేసుకున్నారు. ఒకవైపు తన ప్రేమ కోసం సాహసం చేసిన వధువు పల్లవి, మరోవైపు తనను కాదన్న అమ్మాయి వ్యక్తిత్వాన్ని గౌరవించిన వరుడు వేణుగోపాల్.. వీరిద్దరి నిర్ణయాలు సమాజంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. ప్రేమ, పెళ్లి అనేవి బలవంతంగా రుద్దేవి కావని, అవగాహనతో కూడినవని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

# దొడ్డి కొమురయ్య 99 వ వేడుకలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దొడ్డి కొమురయ్య సాగించిన పోరాటం అజరామమైందన్నారు. పీడిత వర్గాల విముక్తి కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ సమాజం ముందుకు సాగాలన్నారు. అ మహనీయుని స్మారకార్థంగా హైదరాబాదులో స్మారక కేంద్రం తో పాటు ట్యాంక్ బండ్ పై నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గౌర బక్కయ్య,
రేగు సిద్ధులు జన్నె సిద్దులు, ఎమ్మ శ్రీను, కోరే వెంకటయ్య ,పోసుగొండ మధు, రావుల ఉపేందర్ వివిధ సంఘాల నేతలు నెమిల కేదారి గౌడ్, రేగు శ్రీశైలం, కొజ్జిగ వీరయ్య ఏమ్మ బాలరాజు, కొలనుపాక బాలయ్య, కర్రె కిష్టయ్య బైకని బిక్షపతి, బచ్చని నర్సింలు దయ్యాల రవి, బండి స్వామి కనకయ్య, జూకంటి సిద్దులు నారపాక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండల ను సైతం లెక్కచేయని భక్తులు

**హుజూర్ నగర్ ఏప్రిల్ 3 పెన్ పవర్:** హుజూర్ నగర్ పట్టణానికి అతి సమీపాన స్వయంభుగా వెలిసిన స్వామి పడగ రాయి గుట్ట స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆ స్వామి సన్నిధిలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు అంతేకాకుండా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇట్టి అన్నదాన కార్యక్రమం దాత కదిర వెంకటరెడ్డి శ్రీలక్ష్మి దంపతులు వేపల సింగారం వాస్తవ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేయడం గొప్ప భాగ్యముగా మేము భావిస్తున్నాం వారు తెలియజేశారు అదేవిధంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం భక్తులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు స్వామి వారి సన్నిధికి వచ్చే భక్తులకు ఎండ నుండి ఎటువంటి ఆటంకాలు కలక్కుండా ఏర్పాట్లు అన్ని చూసుకుంటున్నారు
ఆలయ కమిటీ వారు ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు అదేవిధంగా భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆ దేవుని కరుణ కటాక్షాలు మీ మీద ఉండాలని ఆలయ కమిటీ వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు శాగం రెడ్డి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి పొనుగుపాటి వెంకటేశ్వరరావు కోశాధికారి గుర్రం చిన్న వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు తోడేటి సర్వయ్య వీరవల్లి గురునాథం శంకరమ్మ అమరోజ్ నాగరాజ్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## తుమ్మిడి కుంట చెరువు పనులను.. ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఎం రేవంత్

-3 పేజి తరువాయి
తీసుకుని ఆక్రమణల నుండి విముక్తి చేసింది. ఇప్పుడు ఈ చెరువు విస్తీర్ణాన్ని 28.05 ఎకరాలకు పునరుద్ధరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పునరుద్ధరణ పనుల కోసం ప్రభుత్వం సుమారు 20 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. నగరంలోని చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కబ్జాలకు తావులేకుండా నీటి వనరులను కాపాడుతామని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.

## జీహెచ్ఎంసీకి పెరిగిన ఆదాయం...

-3 పేజి తరువాయి
కార్పొరేషన్‌లో రూ.100.36 కోట్లు, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.562.62 కోట్లు వసూలయ్యాయి. మార్చి నెలలో రూ.453 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు వసూలు కాగా, మార్చి 31వ తేదీనే రూ.162.94 కోట్లు వసూలయ్యాయి.

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం.. విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి

-3 పేజి తరువాయి
చెప్పుకొచ్చారు.
ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేరళ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ రెండున్నరేళ్లు కావొస్తున్నా ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏం చేశారని రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు.తెలంగాణ వచ్చాక పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఏదో చేశామని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, అదేమిటో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

## రేవంత్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. మార్పు రావాలి

-3 పేజి తరువాయి
బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారుతుందని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి తెలిపారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన... మరో రెండు వారాల్లో ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

## కరీంనగర్‌లో దారుణం.. ఐదేళ్ల పిల్లలను బావిలోకి తోసి చంపేసిన కసాయి తండ్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్‌లో దారుణం జరిగింది. కసాయి తండ్రి కన్నబిడ్డలను బావిలోకి తోసేసి చంపేశాడు. ఈ విషాద ఘటన కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్‌లో జరిగింది. భార్యతో గొడవపడిన శ్రీశైలం అనే వ్యక్తి ఐదు సంవత్సరాల కవల పిల్లలను బావిలోకి తోసేశాడు. ఆ తర్వాత బావిలోకి దూకి అతను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. కానీ ఈత రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.శ్రీశైలం చిన్నారులకు మొదట గడ్డిమందు తాగించి, ఆ తర్వాత బావిలోకి తోసేశాడు. స్థానికులు బావిలో వెతకగా ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. స్థానికులు ఆగ్రహంతో శ్రీశైలంను చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ కలహాలు ఈ ఘటనకు కారణమని పోలీసులుప్రాథమికంగా నిర్ధారించారు.

## రణానంతరం మహోన్నత సేవ

**--- ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్ సోదరుడు**

**హైదరాబాద్ పెన్ పవర్:** అంబర్‌పేట పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంబాల శంకర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడం అత్యంత విషాదకర ఘటనగా నిలిచింది. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన శంకర్ ఆకస్మికంగా మృతిచెందడం పోలీస్ శాఖలోనే కాకుండా స్థానిక ప్రజల్లో కూడా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.అయితే పుట్టెడు దుఃఖంలోనూ శంకర్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. తన కుమారుడు ఇక లేడన్న బాధను పక్కన పెట్టి, మరొకరి ప్రాణాలు కాపాడాలనే గొప్ప సంకల్పంతో ఆయన తండ్రి అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు.శంకర్ అవయవాలను రెండు కిడ్నీలు మరియు లివర్ దానం చేయడంతో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు కొత్త జీవితం పొందారు. ఈ మహోన్నత నిర్ణయం ద్వారా శంకర్ మరణానంతరం కూడా జీవించి ఉన్నట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.సమాజంలో అవయవ దానం పట్ల అవగాహన పెంచేలా ఈ సంఘటన నిలిచింది. శంకర్ కుటుంబ సభ్యులు చూపిన ఉదారత, మానవత్వం నిజంగా అభినందనీయం. వారి త్యాగం మరెందరికో స్ఫూర్తిగా నిలవనుం


## రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమే కొడంగల్ లో హరీష్ రావు పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** కొడంగల్లో మాజీ మంత్రి హరీశ్రావు శుక్రవారం పర్యటించారు. హరీష్క రావు మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్దే. మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీల కేటాయింపులు రూ.2731 కోట్లు. ఖర్చు చేసింది కేవలం రూ.50 కోట్లేనని అన్నారు.
సేవాలాల్ కార్పొరేషన్కు రూ.100 కోట్లు కేటాయించారు. రుపాయి కూడా విడుదల చేయలేదు. లగచర్ల రైతులను జైల్లో పెట్టిన ఘనత రేవంత్దే. కేరళ వెళ్లి 6 గ్యారంటీలు అమలు చేశామని చెప్తున్నారు. తెలంగాణలో 6 గ్యారంటీలు అమలౌతున్నట్టు నిరూపిస్తావా. 100శాతం రుణమాఫీ అయినట్టు కొడంగల్లో నిరూపిస్తావా. రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమేనని అన్నారు.
ఈరోజు వరకు లంబాడీలకు కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చేశారు.. డిక్లరేషన్ ఘనం, ఆచరణ శూన్యం . కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నర సంవత్సరాలలో ఎస్టీలకు, ఎస్టీ కార్పొరేషన్కు రూ.2730 కోట్లు పెట్టి ఖర్చు మాత్రం రూ. 50 కోట్లు పెట్టారు. ఒక్క ఎస్సీకి, ఎస్టీకి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. దీన్నిబట్టే ఎస్టీలను కాంగ్రెస్ ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థం అవుతుందిని అన్నారు.
బీఆర్ఎస్ ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, తండాలను గ్రామపంచాయితీ చేసింది, మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఇచ్చాము, వైన్ షాప్ రిజర్వేషన్ ఇచ్చాము, వందల, వేల కోట్ల రూపాయలు సహకారం అందించామని అన్నారు.

# విటమిన్ సి ప్రయోజనాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతీ ఏటా ఏప్రిల్ 4న జాతీయ విటమిన్ సి దినోత్సవం జరుపు కుంటారు. ఈ దినోత్సవం ఆరోగ్యానికి విటమిన్ సి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియ జేయడం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఏర్పాటైంది. విటమిన్ సి అనేది శరీరానికి అత్యవసరమైన పోషక పదార్థం, ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటం మరియు కణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి, లేదా ఆస్కార్బిక్ ఆమ్లం, ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మరియు అనేక శారీరక ప్రక్రియలకు అవసరమైన పోషకం. శరీరం దీనిని స్వంతంగా ఉత్పత్తి చేయలేదు కాబట్టి, మనం తీసుకునే ఆహారం ద్వారా లేదా సప్లిమెంట్ల ద్వారా దీనిని పొందాలి. విటమిన్ సి యొక్క విస్తృత ప్రయోజనాలలో... రోగనిరోధక శక్తిని పెంచడం ద్వారా విటమిన్ సి తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, వాటి పనితీరును కూడా మెరుగు పరుస్తుంది. ఇవి శరీరంలోకి ప్రవేశించే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడటానికి సహాయ పడతాయి. అంతే కాకుండా, విటమిన్ సి యాంటీబాడీల ఉత్పత్తికి కూడా తోడ్పడుతుంది, ఇవి ఇన్ఫెక్షన్లను గుర్తించి నాశనం చేస్తాయి. కాలాజెన్ ఉత్పత్తిలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుంది. కాలాజెన్ అనేది చర్మం, ఎముకలు, కండరాలు, రక్త నాళాలు, ఇతర కణ జాలాలను కలిపి ఉంచే ఒక ప్రోటీన్. గాయాలు త్వరగా మానడానికి మరియు కొత్త కణజాలం ఏర్పడటానికి ఇది చాలా అవసరం. విటమిన్ సి రక్తపోటును తగ్గించడంలో సహాయ పడుతుంది. రక్త నాళాల పనితీరును మెరుగు పరుస్తుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా కొంత పాత్ర పోషిస్తుంది, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడం వల్ల, ఇది శరీరంలోని కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తుంది. ఈ ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణ మవుతాయి. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని సూచిస్తున్నాయి. విటమిన్ సి మెదడు పనితీరుకు కూడా అవసరం. ఇది న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలో పాల్గొంటుంది, ఇవి మానసిక స్థితి, అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేస్తాయి. కొన్ని పరిశోధనలు విటమిన్ సి మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక స్థితిని మెరుగు పరచడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి.వయస్సు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యల్లో మచ్చల క్షీణత ఒకటి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి, ఈ సమస్యను నివారించడంలో లేదా ఆలస్యం చేయడంలో సహాయ పడుతుంది. కొన్ని అధ్యయనాలు విటమిన్ సి ఆస్తమా లక్షణాలను తగ్గించడంలో సహాయ పడుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలలో. ఇది శ్వాస నాళాల్లోని వాపును తగ్గించడంలో సహాయ పడుతుంది. విటమిన్ సి లోపం వల్ల స్కర్వీ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే, స్వల్పకాలిక లోపం కూడా అలసట, బలహీనత, చిగుళ్ళ వాపు మరియు రక్తస్రావం, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలకు దారితీస్తుంది. ఆహారంలో తగినంత విటమిన్ సి లేకపోవడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది, దీని వలన తరచుగా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ సి పుష్కలంగా లభించే ఆహారాలు చాలా ఉన్నాయి. నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, బత్తాయి, బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్‌బెర్రీలు, బ్రోకలీ, క్యాప్సికం (ముఖ్యంగా ఎరుపు మరియు పసుపు), బంగాళా దుంపలు, టమోటాలు,

పాలకూర, క్యాబేజీ, కివి, మామిడి, బొప్పాయి, పుచ్చకాయ.విటమిన్ సి నీటిలో కరిగే విటమిన్ కాబట్టి, వంట చేసేటప్పుడు కొంత మొత్తం కోల్పోయే అవకాశం ఉంది. అందువల్ల, పండ్లను మరియు కూరగాయలను పచ్చిగా తినడం లేదా తక్కువ నీటిలో తక్కువ సమయం ఉడికించడం మంచిది. జాతీయ విటమిన్ సి దినోత్సవం మన ఆరోగ్యానికి ఈ ముఖ్యమైన పోషకం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడం నుండి కణజాల మరమ్మత్తు వరకు అనేక కీలకమైన విధులను నిర్వహిస్తుంది.




## వేముల వర్సెస్ కోమటిరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 3, పెన్ పవర్:** తెలంగాణలో హ్యామ్ రోడ్డు టెండర్ల చుట్టూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. రూ. 8 వేల కోట్ల స్కామ్ జరుగుతోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాటిని తీవ్రంగా ఖండించారు. టెండర్లు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పారదర్శకంగా జరుగుతున్నాయని.. తనపై బురద చల్లడం మానుకోవాలని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఈవివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిందితెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో అభివృద్ధి, పలు శాఖల్లో అవినీతిపై సభ్యులు విమర్శలు గుప్పించుకున్నారు. ఇక తాజాగా.. రాష్ట్ర రాజకీయం రోడ్ల అభివృద్ధి, హ్యామ్ టెండర్ల చుట్టూ తిరుగుతోంది. తనపై, ప్రభుత్వంపైమాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అవినీతి ఆరోపణలను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన వ్యక్తిత్వాన్ని, పనితీరును ఉద్దేశించి మంత్రి కీలక కామెంట్స్ చేశారు.

తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదన్నారు. తాను నిప్పు లాంటి వ్యక్తినని.. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. కనీసం ఆరోపణలు కూడారాలేదని.. అలాంటిది తన శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని కోమటిరెడ్డి మండిపడ్డారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల్లో భారీ స్కామ్ జరుగుతుందన్నవిమర్శలను కోమటిరెడ్డి ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. పారదర్శకంగానే రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్‌అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి వేముల ప్రశాంత్ రెడ్డికి కనీస జ్ఞానం లేదన్నారు. గత పదేళ్లలోరాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.కాగా, రోడ్ల అభివృద్ధి పేరిట తీసుకొస్తున్న హ్యామ్ రోడ్స్ విధానంలో రూ.8 వేల కోట్ల స్కాం జరుగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి ఇటీవల ఆరోపించారు. 6 వేల కిలోమీటర్ల హ్యామ్ మోడల్ రోడ్లకు రూ. 13 వేల కోట్లతో టెండర్ల పిలిచారన్నారు. మొబిలైజేషన్ కింద 10 శాతం అంటే రూ. 1300 కోట్లుముందే ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యిందని ఆరోపించారు. ఈ టెండర్‌లో ఎక్సెస్ టెండర్ వేసుకోవాలని ప్రభుత్వమే సలహాలు ఇవ్వటాన్ని ఆయన తప్పుబట్టారు. హ్యామ్ మోడల్ రోడ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం మరోసారి రివ్యూ చేసుకోవాలని సూచించారు. ఈ రోడ్లను జేఇంఫ్రా , బృందా ఇంఫ్రా కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాని.. ఈ కంపెనీలకు అనుభవం లేదని.. ఆర్అండ్‌బీలో పనులు చేసిన దాఖలాలు లేవని అన్నారు.దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలకు తాజాగా కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు.

## కబ్జా కోరల్లో చెరువులు

**వరంగల్, ఏప్రిల్ 3, పెన్ పవర్:** చినుకు పోనుకోకపోతే గత ఏడాది వర్షాకా లంలో పడ్డ తిప్పలు మళ్ళీ పడాల్సిన పరిస్థితి ఎదురవక తప్పదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వందలాది చెరువులు, కుంటలు, నాళాలు కబ్జా కోరల్లో చిక్కిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా చెరువులు, కుంటలు ఉండగా అందు లో వెయ్యికి పైగా చెరువులు, కుంటలు అధిక విస్తీర్ణంలో కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు వస్తున్నాయి.పట్టణాల్లో ఉన్న చెరువులను ఆక్రమించిన కొందరు అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, గ్రామస్థాయిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమించిన వారు అందులో వ్యవసాయం చేయడం వల్ల చెరువులు, కుంటలు నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి రోజు రోజుకు కుంచించుకుపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అలాగే వరద (నాళాలు) కాలువలను ఆక్రమించడం వల్ల వర్షం నీరు కుంటలు, చెరువుల్లోకి చేరే పరిస్థితి లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన చెరువులుగా గుర్తించిన వాటిని సైతం ఆక్రమిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.చెరువులు, కుంటల బఫర్ జోన్, ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్ టి ఎల్) పరిధిలను దాటేసి కూడా కొందరు చెరువుల్లోకి చొరబడి చెరువులను చెరబడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ఏడాది అక్టోబర్ లో కురిసిన భారీ వర్షాలకు శ్రీ నగరి గా పేరుగాంచిన వరంగల్ రోడ్లన్నీ నదులుగా మారడం, ఎక్కడి నీరు అక్కడే తిష్ట వేసి అనేక కాలనీలు రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకొని భారీగా ఆస్తులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైళ్ల రాకపోకల తో పాటు, రోడ్డు రవాణా కూడా పూర్తిగా స్తంభించిపోయింది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికార వర్గాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం, దీనికి తోడు ఆక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం, ఆక్రమించిన చెరువులు, కుంటలు, నాళాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ సౌకర్యం కల్పించడం విమర్శలకు తావిస్తోంది.దీనివల్ల చెరువులు, కుంటలు, నాళాల విస్తీర్ణం రోజురోజుకు కూచించుకుపోయి, భవిష్యత్తులో చెరువులు, కుంటలు, నాళాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో వరద నీరు చెరువుల్లోకి వెళ్లకుండా, దిగువకు వెళ్ళిపోయి భూగర్భ నీటిమట్టం స్థాయి తగ్గుతుందనే విమర్శలు వస్తున్నాయి.హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణలను తొలగించడానికి 'హైడ్రా' ఏర్పాటుచేసిన విధంగా ప్రతి జిల్లాలో కూడా చెరువులు, కుంటలు, నాళా లు, ఇతర అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనిప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించిన వారిని తొలగించాలని, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణ లు జరగకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టిచెరువులు, కుంటలు, నాళాల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి.చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణ వల్ల రైల్వే శాఖకు కూడా భారీగా నష్టాన్ని తెచ్చిపెడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే ట్రాక్ వెంట ఉన్నచెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించడం వల్ల భారీ వర్షాలకు ఒక్కసారిగా వరద ఉప్పొంగి ప్రవహించడం వల్ఎక్కడైనా చెరువు తెగితే రైల్వే ట్రాక్ పూ ర్తిగా నీట మునిగి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అక్టోబర్ 2025లో కురిసిన భారీ వర్షాలకు కాజీపేట నుండి డోర్నకల్ సెక్షన్లో కొన్ని కుంటలు తెగిపోవడంతో భారీ వరద రైల్వే ట్రాక్ ను ముంచెత్తింది.దీనితో ఒకరోజు పూర్తిగా దక్షిణాది నుండి ఉత్తరాదికి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్లన్నీ కూడా చెరువులను తలపించాయి. అలాగే వర్షాకాలంలోకురిసిన భారీ వర్షానికి కేసముద్రం ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. దీనితో రోజులపాటు రైళ్ల రాకపోకలు స్తంభించాయి. రైల్వే శాఖ 'ట్రాక్ ఎఫెక్టెడ్ ట్యాంక్స్' ను గుర్తించి వాటి నుండి వరద ముప్పు నివారణకు కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు స్పందించి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు, నాళా ల ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ సర్వే నిర్వహించి , హద్దులు నిర్ణయించి ఎఫ్ టీ ఎల్ పరిధిలో నిర్మించిన నిర్మాణాలను తొలగించి, చెరువులు, కుంటలు, నాళాలను పరిరక్షించే కార్య క్రమాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువులు, కుంటలు, నాళాలు ఆక్ర మణకు గురైతే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# హైదరాబాద్ కు మరో డాల్బీ థియేటర్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, పెన్ పవర్:**
రెండు వారాల కిందట హైదరాబాద్‌లో ప్రారంభమైన అల్లు సినిమాస్ డాల్బీ థియేటర్ ఇప్పుడు నగరానికే ఓ స్పెషల్ అట్రాక్షన్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యామిలీ పేరుతో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా హైదరాబాద్‌కు మరో డాల్బీ థియేటర్‌ను తీసుకురాబోతున్నారు. మహేష్‌కు థియేటర్లు కొత్తకాదు.. ఆయన చాలా ఏళ్లుగా ఈ బిజినెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు మహేష్ కూడా హైదరాబాద్‌కు డాల్బీ తెస్తున్నారు.సూపర్ స్టార్ మహేష్‌బాబు చాలా ఏళ్ల కిందటి నుంచి వివిధ రకాల బిజినెస్‌లలో ఉన్నారు. అందులో ముఖ్యమైంది మూవీస్. ప్రముఖ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ ఆసియన్ సునీల్ భాగస్వామ్యంతో మహేశ్‌బాబు ఏఎంబీ సినిమాస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్ కింద వివిధ నగరాల్లో మల్టిప్లెక్స్‌లు ఉన్నాయి. అల్లు సినిమాస్ ఈ మధ్యన హైదరాబాద్‌లో డాల్బీ థియేటర్‌ను ప్రారంభించింది కానీ.. అసలు సౌత్ ఇండియాలో మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను ఇంట్రడ్యూస్ చేసింది మహేష్ బాబే. ఈ జనవరి 16న బెంగళూరులోని లో సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను మహేష్ ప్రారంభించారు.9 స్క్రీన్‌లు ఉన్న ఆ మల్టిప్లెక్స్‌లో 588 సీట్లు ఉన్న పెద్ద థియేటర్‌ను డాల్బీగా మార్చారు. ఇప్పుడు అదే క్రమంలో హైదరాబాద్‌కు ఆయన డాల్బీ థియేటర్‌ను తెస్తున్నారు. హైదరాబాద్ సినిమా కూడలి అయిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ని సుదర్శన్ థియేటర్‌ను మహేష్‌బాబు భాగస్వామ్యంలో ఆసియన్ సంస్థ ఏఎంబీ క్లాసిక్ పేరుతో మల్టిప్లెక్స్‌గా మారుస్తోంది. పాత థియేటర్ స్థానంలో మొత్తం 7 స్క్రీన్ల మల్టిప్లెక్స్ అక్కడ వస్తోంది. ఇప్పుడు అందులో ఓ ఆడిటోరియంను డాల్బీ థియేటర్‌గా మారుస్తున్నారు. 4ఖ లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ విజన్ స్క్రీన్ అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే కోకాపేటలో దేశంలోనేఅతిపెద్ద డాల్బీ స్క్రీన్ అందుబాటులోకి వచ్చింది. ఇది వెస్ట్ హైదరాబాద్‌లో ఉంటే.. మహేష్ డాల్బీ థియేటర్ హైదరాబాద్ నడిబొడ్డున రానుంది. పైగా క్రాస్‌రోడ్ అంటే సినిమా జంక్షన్. సో నగరవాసులకు అందుబాటులోకిస్క్రీన్ వస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి క్లాసిక్ డాల్బీ రెడీ కానుంది. మహేష్‌బాబు సినిమానే కాదు... హైదరాబాద్‌లో అతి తొందరలోనే మరో డాల్బీ సినిమా అంద్నుటులోకి వస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ జీడిమెట్ల రంగా థియేటర్‌ను తీసుకుని దానిని పూర్తిగా ఆధునీకరిస్తోంది. ఈ థియటర్‌కూడా డాల్బీ విజన్ స్క్రీన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. అది ఈ ఏడాది జూన్ నాటికే రెడీ అవుతుందంట.. అయితేఇక హైదరాబాద్ వాసులకు పండుగే. ఈ ఏడాది

చివరినాటికి మొత్తం మూడు డాల్బీ థియేటర్లు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే నగరంలోని పెద్ద స్క్రీన్, థియేటర్ అయిన ప్రసాద్సు కూడాఆధునీకరించారు. లేటెస్ట్.. ప్రొజెక్షన్ అందుబాటులోకి తెచ్చారు. ఇక హైదరాబాద్‌కు ఉన్న లోటు స్క్రీన్. ఒకప్పుడు ప్రసాద్స్‌లో ఉన్న ఐ మ్యాకస్ సేవలు నిలిచిపోవడంతో ఆ లోటు అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు

మన సినిమాలు భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వస్తున్నాయి. భారీ స్క్రీన్‌లపై వాటిని అనుభూతి చెందితే ఆ థ్రిల్లే వేరు. వారణాసి, రామయణ్ లాంటి ఇండియన్‌మూవీస్‌ను ఇప్పుడు ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరించారు.మరికొన్ని భారీ సినిమాలు కూడా వస్తాయి. అయితే హైదరాబాద్‌లో

స్క్రీన్ కూడా మహేష్‌బాబునే తీసుకొచ్చే అవకాశం ఉంది. ఆసియన్ భాగస్వామ్యంతో హకీంపేట్ వద్ద భారీ థియేటర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఓస్క్రీన్ ఐమాక్స్ అవుతుందనే ప్రచారం జరుగుతోంది కానీ.. దానిని వాళ్లు అధికారికంగా ధృవీకరించలేదు.

# మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో కీలక మార్పులు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో పౌర సేవలను డిజిటల్ రూపంలో ప్రజలకు చేరవేసే మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 15 ఏళ్లుగా ఉన్న పెంపు డిమాండ్‌ను ఇన్ని రోజులు నెరవేర్చారు. ఇప్పుడు పెరిగిన ఛార్జీల ప్రకారం ఏయే సర్టిఫికెట్లకు ఎంత వసూలు చేస్తారో చూద్దాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఉత్తర్వుల మేరకు, బుధవారం నుంచి అన్ని రకాల పౌరసేవలపై వినియోగ ఛార్జీలు పెరిగాయి. గతంలో కేవలం వినియోగ ఛార్జీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం వీటికి 18 శాతం జీఎస్టీని అదనంగా చేర్చింది. మీ సేవలో అందించే సేవలను ప్రధానంగా రెండు కేటగిరీలుగా విభజిస్తారు. కేటగిరి ఏలో ఉండే డాక్యుమెంట్ స్కాన్ లేదా సంబంధిత విభాగాల విచారణ అవసరం లేని సేవలు ఉంటాయి. గతంలో దీనికి 35 రూపాయలు వసూలు చేసే వారు. ఇప్పుడు దీన్ని 62 రూపాయలకు పెంచారు.కేటగిరి బీలో వివిధ శాఖల విచారణ లేదా పరిశీలిన తర్వాత అందించే సేవలు వస్తాయి. ఈ కేటగిరి కింద అందించే సేవలకు 45 రూపాయలు తీసుకునే వాళ్లు. ఇప్పుడు దాన్ని 80 రూపాయలకు పెంచారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన పెంపు 50శాతమే అయినప్పటికీ జీఎస్టీని కూడా పరిగణలోకి తీసుకుంటే ఈ భారం 77 శాతం నుంచి 78 వరకు పెరుగుతుంది. ఈ ధరల పెంపు ముఖ్యంగా సర్టిఫికెట్లు కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లి వారిపై ప్రభావం చూపనుంది. ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రం తీసుకునే వారు కేవలం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ కోసం 80 రూపాయలు చెల్లించాలి. గతంలో




దరఖాస్తుతోపాటు నాలుగు కంటే ఎక్కువ పేజీలు స్కాన్ చేయాల్సి వస్తే పేజీకి రెండు రూపాయలు వసూలు చేసే వాళ్లు ఇప్పుడు అది 2.50కు పెంచారు. ప్రజలపై భారం వేసిన ప్రభుత్వం మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఊరట కల్పించింది. వారి కమిషన్లు పెంచింది. కేటగిరి ఏలో సేవలకు గతంలో 13 రూపాయల కమీషన్ ఉండేది. దీన్ని ఇప్పుడు 40.34 రూపాయలకు పెంచారు. కేటగిరి బీ సేవలకు 52.10 రూపాయాల కమిషన్ ఇస్తారు.

**ఎక్కువ తీసుకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి?**

ప్రభుత్వం నిర్ణయించిన ఈ కొత్త ధరల కంటే మీ సేవ కేంద్రాల నిర్వాహకులు అదనంగా వసూలు చేయడానికి లేదు. అలా ఎవరైనా వసూళ్లకు పాల్పడిదే 1100 లేదా 18004251110 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు లేదా. meesevasupport@telangana.gov.inకు మెయిల్ చేయవచ్చు.

# అడ్డూ, అదుపు లేకుండా ఫీజులు

## నిద్రొతున్న విద్యాశాఖ

**నల్గొండవరంగల్, ఏప్రిల్ 3, పెన్ పవర్:**
జూన్ లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఎలా ఉంటాయన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైంది.ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులు పెంచుతున్న సంకేతాలు యాజమాన్యాల నుంచి తల్లిదండ్రులకు అందాయి. పరిస్థితులు ఎలా ఉన్నా యాజమాన్యాలు ఏడాది కోసారి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నాయి. నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫీజుల భారం లేకుండా చేస్తామని గత సర్కార్ కమిటీల పేరిట సాగదీసింది.పస్తుత ప్రభుత్వం గద్దెనెక్కి రెండేం డ్లు దాటినా ఫీజుల దోపిడీని అరికట్టలేకపోయింది. ఇది వచ్చే విద్యాసంవత్సరానికైనా అమల్లోకి వస్తుందా అన్నది సంశయంగానే ఉంది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో విద్యా సంవత్సరం అంటే ఫీజుల దోపిడీ అన్నట్టుగా మారింది. ఇంజినీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు. అదే పాఠశాల విషయానికి వస్తే కార్పొరేట్ స్కూళ్లలో రూ.5 లక్షలు! పటాన్చెరు ప్రాంతానికి చెందిన ఓ పాఠ శాల కొద్దిరోజుల క్రితం పాఠ్యపుస్తకాల ధరలను రూ.18 వేలకు పెంచింది.అలాగే పేరొందిన ప్రముఖ విద్యా సంస్థలు ఆరో

తరగతి ఫీజును అమాంతం 30 వేల రూపాయలు అదనంగా పెంచాయి! దీన్ని సాకుగా చూపెడుతూ కొన్ని యాజమాన్యాలు మా దగ్గర ఫీజు తక్కువగా ఉంది. బయట చూడండి మీకే తెలుస్తుంది అంటూ ఏదో తక్కువ చేస్తున్నట్టు నటి స్తూ అందినకాడికి దండుకుంటున్నాయి.ఇలాగైతే సామా న్యుల పిల్లలకు విద్య అందేనా? ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు? ఈ ప్రశ్నే తల్లిదండ్రుల గుండెలో ఇప్పుడు ఒక ఆందోళనగా ఉంటోంది. ఇంత బహిరంగంగా ఫీజుల్ని పెంచుతుంటే, ప్రభుత్వ పెద్దల కట్టడి చేసే చర్యలు మాటలకే పరిమితం కావడం శోచనీయం.ప్రభుత్వం ఏడాది క్రితమే ఫీజుల నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు నమూనా సిద్ధమైనప్పటికీ, దాని పై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు.ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనేక అంశాలపై బిల్లులు ఆమోదం పొంది నా ఫీజుల బిల్లును మాత్రం ఆమోదానికి పెట్ట లేదు. దీని వెనుక అంతర్య మేంటి? వ్యక్తిగత అంశాలపై సవాల్ విసురు కునేందుకు సమయం కేటాయించిన అధికార, ప్రధాన ప్రతిపక్షసభ్యులు లక్షల మందికి ఉపయోగపడే బిల్లు గురించి ఎందుకు మాట్లాడలేదు? కావాలనే పక్కన పడేశారా అన చర్చ ఇప్పుడు నడుస్తోంది.దీనికి జవాబు పాలకులే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత సర్కార్ రుసుములను కట్టడి వేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబర్లో ప్రకటించింది.రాష్ట్ర విద్యాకమిషన్ కూడా దీనికోసం చట్టం తీసుకురా వాలని స్పష్టంగా సిఫార్సు చేసింది. అయినప్పటికీ అమల్లోకి రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు విద్య వంటి ప్రాథమిక హక్కు విషయంలో ఇలా ఆలస్యం చేయడం అనేక అనార్థాలకు దారితీస్తుందని మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం. ఇంకోవైపు, అందరికీ అందుబా టులో నాణ్యమైన విద్య అనే నినాదం ప్రజలను ఆకర్షించేలా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు దానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామనే ప్రకటనలు వినిపిస్తున్నాయి.యంగ్ ఇండియా వంటి పేర్లతో కొత్త ప్రభుత్వ పాఠశాలల ప్రచారం జరగడం ఒకవైపు ఆశాజనకంగా కనిపించినా, టెక్నో, గ్లోబల్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోచుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ఫీజులు పెంచుకునేందుకు పాలకవర్గాలే అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అదనపు ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో మరింత భారాన్ని మోపుతు న్నాయి. దీనివల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.విద్యను వ్యాపారంగా మార్చే ధోరణి పెరుగు తున్నప్పుడు,ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.కానీ, లేకపోవడం బాధాకరం. విద్య అనేది లాభాపేక్షతో నడిచే రంగం కాకూడదు. అది సమాజ అభివృద్ధికి పునాది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దీన్ని నిర్వర్తించడంలో ఆలస్యం చేయడమంటే భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టినట్టే. ఇలాంటి పరిస్థితుల్లో మాటలు కాకుండా చర్యలుఅవసరం. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆ చట్టంలో ప్రతి పాఠశాల ఫీజుల నిర్మాణం పారదర్శ కంగా ఉండేలా నిబంధనలు పెట్టాలి. నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసి, ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాలి.

# యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 3:** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడుతుంది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో రేషన్ సన్నబియ్యాన్ని నిర్భయంగా కొంతమంది రేషన్ డీలర్లు రేషన్ వినియోగదారుల నుండి కొని ఓ ప్రైవేటు వ్యక్తికి విక్రయించడంతో ఈ అక్రమ రేషన్ బియ్యం రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా కొనసాగుతుంది. రేషన్ డీలర్ల వద్ద సదరు ప్రైవేటు వ్యక్తి రేషన్ బియ్యాన్ని 800 రూపాయలకు కొని బయట 1200. రూపాయలకు డిమాండ్ పెరిగితె 1500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుర్తు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో రేషన్ దుకాణం నుండి బియ్యాన్ని పిడిఎస్ సంచుల నుండి వేరే సంచులకి మార్చి ద్విచక్ర వాహనంపై తీసుకువెల్తూ ఒక ఇంటి వద్ద డంపు చేస్తూ పగటివేలలో ఎలాంటి జంకు బొంకు లేకుండా అమ్ముతున్నారు రేషన్ దుకాణాలను అడ్డాగా చేసుకొని డీలర్లు బియ్యాన్ని ఆక్రమంగా
విక్రయించినా పట్టించుకునే వారే కరువయ్యారు. సదరు డీలర్లు కనీసం స్టాక్ రికార్డును నిర్వహణ చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. రేషన్ దుకాణాల నుంచి ప్రైవేటు వ్యక్తి క్వింటాల కొద్దీ బియ్యాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకు వెళుతున్నా అధికారులు సైతం అక్రమ బియ్యం రవాణా పై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ బియ్యం రవాణాపై నిఘా ఉంచి బియ్యాన్ని అక్రమంగా విక్రయించిన డీలర్ల పై సదరు ప్రైవేట్ వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు





**క్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ ప్రార్థనలు చేసిన క్రైస్తవులు**

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 3:** దైవ కుమారుడు, కరుణామయుడు ఏసు క్రీస్తు మానవాళిని పాపాల నుంచి విముక్తి చేయడానికి ఈ లోకంలో జన్మించి శిలువలో రక్తం చిందించి ప్రాణాలు అర్పించారని, గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతి నాయక్ అన్నారు. గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఇందిరా నగర్ కాలనీ ఆర్ సి ఎం చర్చ్ దైవజనులు సంతోష్ సంఘస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం గుడ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు ఏసుక్రీస్తు ప్రాణ త్యాగం చేసిన రోజు కావడంతో త్యాగానికి ప్రతీకగా శుభ శుక్రవారం తోలుత ఉదయాన్నే క్రైస్తవులు ఉప వాస
దీక్షలు చేపట్టి భక్తిశ్రద్ధలతో చర్చ్ లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు గుడ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని సిలువ వేయబడిన ఏసుక్రీస్తును ఆయన శ్రమలను ధ్యానం చేస్తూ 14 ఘట్టాలను దేవునిని ఘనంగా ఆరాధిస్తూ సిలువ యాగం చేపట్టి గార్ల పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టి ఏసుక్రీస్తు కొరకు అతి గొప్పగా ప్రార్థనలు చేస్తూ ప్రభువును బంధించడం నుంచి సిలువ వేసే వరకు సంబంధించిన వివిధ కళారూపా ఘట్టాలను ప్రదర్శిస్తూ యేసయ్య భక్తి గీతాలు ఆలపిస్తూ 100మంది విస్వాసులు ర్యాలీ నిర్వహించారు అనంతరం బాల భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఏసుక్రీస్తు శిలువను భక్తులు తాకి ప్రత్యేక ప్రార్థనలు చేశారు అనంతరం దైవజనులు సంతోష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుసరించిన శాంతి మార్గం సిలువలో పలికిన ఏడు మాటలను సందేశం ఇచ్చారు సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పిం చారని గుడ్ ఫ్రైడే ద్వారా ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల ద్వారా క్షమాగుణం బాధ్యత ప్రేమ పాపపు ఒప్పు కోలు దయా గుణాలను అలవర్చుకోవాలన్నారు. పాపపు జీవితాన్ని వదిలి క్రీస్తు చూపిన మార్గంలో నడిచి పరలోకం చేరాలని బోధించారు ఈ కార్యక్రమంలో. బాలస్వామి రమేష్ కిర ణ్ ప్రేమ్ కుమార్ నరేష్ ఆకారపు శ్రీనివాస్ పిడమర్తి దాస్ పాలడుగు వినయ్ పాలడుగు సరస్వతి ఏసుప్రభు వేషధారి ఆకారపు కిరణ్ అధిక సంఖ్యలో ఏసుప్రభు భక్తులు తదితరులు ఉన్నారు.

# దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు పాటుపడాలి

**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 3:**
దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు పాటుపడదామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు.దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొనిమహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక నల్లమల గిరి ప్రసాద్ భవనంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శు క్రవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు తోలుత దోడ్డి కోమరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుకట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం పాలనలో గ్రామాల్లో జాగీర్దారులు, దొరలు, భూస్వాముల ఆగడాలు పెరగడాన్ని దొడ్డి కొమురయ్య తట్టుకలేదన్నారు. వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో కొమురయ్య ఒకరని కొనియాడారు. ఆంధ్రమహాసభకు మద్దతుగా ఉద్యమించిన పోరాటంలో అసువులు బాసినట్లు చెప్పారు. కొమురయ్య అమరత్వంతోనే సాయుధ పోరాటం ప్రారంభమైందన్నారు.ఈ కార్యక్రమంలో



సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, దూపాటి జనార్ధన్,కట్టెభోయిన భిక్షమయ్య,పొన్నం వెంకటేశ్వర్లు, దారావత్ వీరన్న ,రాగం నాగేశ్వరరావు, కట్టెబోయిన పిచ్చయ్య, మాగం రంగయ్య ,కట్టెబోయిన శ్రీనివాస్, పొన్నం ఉపెందర్, చౌకాల భిక్షం,దొడ్ల రాంబాబు,ఇరుగునాగరాజు,సంఘం వినోద్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

### ఎల్బీనగర్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

**ఎల్బీనగర్, పెన్ పవర్ ఏప్రిల్ 3:** ఎల్బీనగర్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య కురుమ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అగ్నికణిక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ అని కొనియాడారు. దొడ్డి కొమురయ్య కురుమ తన త్యాగంతో తెలంగాణ ప్రజల్లో తిరుగుబాటు జ్యోతి రగిలించి, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని నూరిపోశారని గుర్తు చేశారు. ఆయన చూపించిన మార్గం, పోరాట స్ఫూర్తి నేటికీ ప్రతిఒక్కరికి ఆదర్శమని తెలిపారు. అంతకుముందు దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు, వివిధ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి పబ్ లలో ఈగల్ టీం తనిఖీలు

**హైదరాబాద్: పెన్ పవర్:** గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ పరిధిలో పబ్ లలో ఈగల్ టీం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కోండాపూర్ లోని క్వాక్ ఎరినా పబ్ లో తనిఖీలు నిర్వహించారు. గురువారం రాత్రి సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రముఖ డీజే బ్లాక్ కాఫీ పేరిట పబ్ నిర్వాహకులు భారీ ఈవెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈగల్ టీమ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 8 మందికి డ్రగ్స్ పాజిటివ్ గా గుర్తించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చినవారికి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కి తరలించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## దొడ్డి కొమరయ్యకు బీఆర్ఎస్ నేతల నివాళులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా.. తెలంగాణ భవన్ లో వారి చిత్ర పటానికి బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుమిత్రానంద్, ఉపేంద్ర చారి, బాలరాజ్ యాదవ్, కురువ విజయ్ కుమార్, తుంగ బాలు, దేవరి మల్లప్ప తదితరులు పాల్గోన్నారు.

## కాళీయమర్దన అలంకారంలో రామచంద్రుని కరుణామృతం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు కాళీయమర్దన అలంకారంలో భక్తులను కటాక్షించారు.
ఉదయం 7.30 నుండి 9.30
గంటల వరకు జరిగిన వాహన సేవలో భజన బృందాలు భక్తిరసభరితంగా భజనలు, కోలాటాలు నిర్వహించగా, స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను ఆనందింపజేశారు.
వాహనసేవ అనంతరం ఉదయం 11
గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం వంటి పవిత్ర ద్రవ్యాలతో శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరాముల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం చేశారు

## కొండగట్టు లో భక్తుల అందోళన

**జగిత్యాల: పెన్ పవర్:** హనుమాన్ జయంతి రోజున కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి భక్తులు నిరసనకు దిగారు. గంటల తరబడి క్యూ లైన్లో వేచిచూస్తున్న భక్తులకు లడ్డూ ప్రసాదం అందుబాటులో లేకుండా పోయింది. ప్రసాదం అడిగితే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆరోపించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు.

## ప్రైవేటు స్కూళ్లకి కళ్లెం వేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు 30% నుంచి 40% ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లితండ్రులకు తలకు మించిన భారంగా మారుతున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. . అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ స్కూల్ యాజమాన్యాల పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.. అధిక ఫీజు వసూళ్లను కట్టడి చేయాలని అన్నారు.

## ఈ నెల 13 న జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఏప్రిల్ 13వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఏప్రిల్ 7వ తేదీన జీవన్ రెడ్డి నివాసానికి కేటీఆర్ వెళ్లి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఏప్రిల్ 13న పార్టీ చేరిక అనంతరం, జగిత్యాలలోనే పార్టీ ప్లీనరీ పెట్టాలనే ఆలోచనలో బీఆర్ఎస్ పార్టీ వుందని సమాచారం.

## భూబాధితుల దీక్షకు మద్దతు తెలిపిన సబిత ఇంద్రారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** పదకొండు రోజులుగా పరిగి మండలం కాడ్లాపూర్ గ్రామంలో భూ బాధితుల రిలే నిరహార దీక్ష కొనసాగుతోంది. వికారాబాద్ జిల్లాలోని ఇండస్టియల్ పార్కో భూమి కోల్పోతున్న రైతుల రిలే నిరహార దీక్షకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరయ్యారు. సబితా ఇంద్రారెడ్డితో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. భూమి తప్ప తమకు వేరే ఆదారం లేదని తెలిసారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు.

## డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా హుజురాబాద్ బంద్

**హుజురాబాద్ పెన్ పవర్:** హుజురాబాద్ పట్టణం శుక్రవారం ప్రజా గర్జనతో మార్మోగింది. 'వేస్ట్ టు ఎనర్జీ' డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిలుపుతో చేపట్టిన బంద్‌కు విస్తృత స్పందన లభించింది. పట్టణం మొత్తం ఒకే స్వరంతో నిరసన వ్యక్తం చేయడంతో డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం మరింత ఉధృతమైంది.ఉదయం మొదలైన బంద్‌కు వ్యాపారులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. నిత్యావసర సేవలు మినహా అన్ని రంగాలు బంద్‌లో పాల్గొనడం గమనార్హం. పెట్రోల్ బంకులు సైతం స్వచ్ఛందంగా మూసివేసి నిరసనకు మద్దతు తెలపడం ఉద్యమ తీవ్రతను చాటింది.ఇక ఉదయం నుంచే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగుతూ డంపింగ్ యార్డ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించారు. వ్యాపారులను కలిసి బంద్‌కు సహకరించాలని కోరగా, ప్రజలు, వ్యాపారులు ఉత్సాహంగా స్పందించారు.సిరసపల్లి శివారులో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు 12వ రోజుకు చేరుకోవడంతో ఉద్యమం మరింత వేడెక్కింది. అంబేద్కర్ చౌరస్తాలో నిరసనకారులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా ఉన్న ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ లో గొంతు లేస్తోంది...



**హైదరాబాద్, ఏప్రిల్ 3, పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలొ ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు.ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయని అంటున్నారు ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు. జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు. ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు. ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్ లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు

# టార్గెట్ హరీష్ రావు...



**హైదరాబాద్, ఏప్రిల్ 3, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుకదపెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత , అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది.ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి.రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ‘ బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## మునగ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పోషక విలువలు

**అధికంగా ఉన్న కూరగాయలలో ఒకటి డాక్టర్. యమున**

**కరీంనగర్: పెన్ పవర్:** డాక్టర్. యమున తెలుపుతూ అసాధారణమైన ఆరోగ్య ప్రయోజనాల వల్ల శతాబ్దాలుగా ఇది సంప్రదాయ ఆహారాల్లో వైద్యంలో కీలక పాత్ర పోషిస్తోంది.అత్యవసర విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు,మరియు వృక్ష ఆధారిత ప్రోటీన్‌తో నిండిన మునగ ఆధునిక శాస్త్రం నిర్ధారించే చాలా ముందే ఒక సహజ సూపర్‌ఫుడ్‌గా గుర్తింపు పొందింది. మునగ చెట్టులోని ప్రతి భాగం పోషక విలువ కలిగి ఉన్నప్పటికీ,ప్రత్యేకంగా మునగకాయలు, మరియు ఆకులు అత్యంత పోషకసాంద్రత కలిగి ఉంటాయి. వీటిలో విటమిన్ సి. విటమిన్ ఏ,కాల్షియం, పొటాషియం, ఇనుము, మాగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అలాగే మునగలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు వాపును తగ్గించడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో, ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి శరీరాన్ని కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దీంతో దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఇది ఎంతో ఉపయోగకరం. మునగ యొక్క గొప్ప ప్రయోజనాల్లో ఒకటి హానికరమైన స్టిమ్యులెంట్లపై ఆధారపడకుండా శక్తి, ఉత్సాహాన్ని పెంచడం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, హృదయ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో, జీర్ణక్రియను సరిచేయడంలో, ఎముకలను బలపరచడంలో సహాయపడుతుంది. అలసట, పోషక లోపాలు, లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి మునగ ఒక సహజ పునరుజ్జీవకంలా పనిచేస్తుంది మరియు జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. భారతదేశం, ఆఫ్రికా ప్రాంతాల్లో మునగను తరచుగా జీవన వృక్షం గా పిలుస్తారు. పోషకాహార లోపాన్ని తగ్గించడం,ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లో దీనికి ఉన్న శక్తి ఇందుకు కారణం. ఇది తక్కువ ఖర్చుతో లభించే,పర్యావరణానికి అనుకూలమైన, అనేక వంటకాలలో ఉపయోగించగల అత్యంత ప్రయోజనకరమైన ఆహారం. మునగ మనకు ఒక విషయం గుర్తు చేస్తుంది: అత్యంత శక్తివంతమైన మన ఆహారంలోనే సహజంగా పెరుగుతుంది. అసాధారణమైన పోషక విలువలు,వైద్య ప్రయోజనాలతో కూడిన మునగ ఒక కూరగాయ మాత్రమే కాదు ఆరోగ్యం సంక్షేమం దీర్ఘాయుష్షుకు సహకరించే ఒక ప్రకృతి వరం..

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అసమాన శాస్త్ర పరిశోధకుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అనికూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలెనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరంను కనుగొన్నాడు. పదార్థం స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది. సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1832 జూన్ 17 లో జన్మించాడు. 1850 నుండి 1854 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్మ్ వోన్ హోఫ్మాన్న్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలెనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1851 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ విభాగంలో 1854 లో, ఛెస్టర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1855లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1859 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు. 1861 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్ అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1863 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు. ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి “ఋణధృవ కిరణాలు” అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1879 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన “ప్లాస్మా” స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి “రేడియంట్ మేటర్” అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది. 1880 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1895 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం –చీ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేనియాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే “జూ–కణముల”ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో “డైమండ్స్” అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910లో క్రూక్స్ “ఆర్డర్ ఆఫ్ మెరిట్”ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

# గనుల తవ్వకాలు: పర్యావరణ ధ్వంసం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని 2005లో ప్రారంభించింది. యుద్ధాలు, సాయుధ పోరాటాలు ముగిసిన తర్వాత కూడా భూమిలో మిగిలి పోయిన మందు పాతరలు, పేలుడు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతే కాకుండా, వీటిని నిర్మూలించ డానికి జరుగుతున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం, బాధితులకు సహాయం అందించడం కూడా ఈ దినోత్సవం లక్ష్యాలలో ముఖ్యమైనవి. యుద్ధాలు ముగిసిన తరువాత కూడా మందుపాతరలు ఒక పెద్ద సమస్యగా మిగిలి పోతాయి. ఇవి పొలాలు, రహదారులు, నివాస ప్రాంతాలు ఇలా ఎక్కడైనా ఉండవచ్చు. వీటి గురించి తెలియని సామాన్య ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, రైతులు, పేదవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మందు పాతర పేలినప్పుడు ప్రాణనష్టం జరగవచ్చు లేదా శాశ్వత వైకల్యం సంభవించవచ్చు. అంతే కాకుండా, ఇది దేశాల ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం కలిగిస్తుంది. వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారతాయి, రవాణా వ్యవస్థ స్తంభించి పోతుంది, ప్రజలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం ప్రధాన లక్ష్యాలలో...మందు పాతరల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, మందు పాతరల నిర్మూలనకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ప్రాజెక్టులకు ఆర్థికంగా, ఇతర విధాలుగా మద్దతు అందించడం, మందు పాతరల బాధితులకు అవసరమైన వైద్య సహాయం, మానసిక మద్దతు, పునరావాస సౌకర్యాలు కల్పించడం, మందు పాతరల సమస్య యొక్క తీవ్రతను తెలియ జేయడం, దీని పరిష్కారానికి అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వీటిలో కొన్ని ముఖ్యమైనవి... మందు పాతరల ప్రమాదాల గురించి అవగాహన కల్పించే ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనకు సంబంధించిన విషయాలపై చర్చాగోష్ఠులు సెమినార్లు ఏర్పాటు చేయడం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. మందు పాతరల నిర్మూలనలో పాల్గొనే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం. మందు పాతరల బాధితులకు మానసిక మరియు వైద్య సహాయం అందించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం. మందుపాతరల సమస్యపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి మీడియా ప్రచారం నిర్వహించడం. భారత దేశంలో కూడా సరిహద్దు ప్రాంతాలలో మందు పాతరల సమస్య ఉంది. భారత సైన్యం ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో కీలకమైన పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ సమస్య తీవ్రతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మందు పాతరల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు, గనుల తవ్వకం కూడా పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. గనుల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. అంతే కాకుండా, గనుల కోసం అడవులను నరకడం వల్ల వన్య ప్రాణులు వాటి ఆవాసాలను కోల్పోతాయి. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. గనులలో పనిచేసే కార్మికులకు కూడా ఆరోగ్య సమస్యలు మరియు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి, గనుల తవ్వకం విషయంలో పర్యావరణ హిత విధానాలను అనుసరించడం, కార్మికుల భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. అంతర్జాతీయ గనుల అవగాహన దినోత్సవం కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం కాకూడదు. మందు పాతరల సమస్య తీవ్రతను గుర్తించి, దీనిని నిర్మూలించ డానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి. బాధితులకు సహాయం అందించడానికి ముందుకు రావాలి. భవిష్యత్ తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించడమే మనందరి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మందుపాతరల గురించి అవగాహన పెంచుకోవడం, ఈ సమస్యపై పోరాడటానికి కలిసి రావడం చాలా అవసరం.

# గజ్వేల్, సిద్దిపేటలో ప్రశాంతంగా హనుమాన్ జయంతి వేడుకలు

**పటిష్ట బందోబస్తు మధ్య ముగిసిన శోభాయాత్రలు**

**సిద్ధిపేట: పెన్ పవర్:** సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించబడ్డాయి. ముఖ్యంగా గజ్వేల్ మరియు సిద్ధిపేట పట్టణాలలో భారీ ఎత్తున శోభాయాత్రలు నిర్వహించ బడ్డాయి.వేడుకల సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ముందస్తు ప్రణాళికతో పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించారు. శోభాయాత్రల కారణంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను సక్రమంగా మళ్లించడం జరిగింది.ర్యాలీలు సాగిన మార్గాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

శాంతి భద్రతలను కాపాడటంలో సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది మరియు ప్రజలకు కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్, ఐ ధన్యవాదాలు తెలిపారు.



# చిత్తూరు-తచ్చూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే

**తిరుపతి, ఏప్రిల్ 3, పెన్ పవర్:**
ఏపీలో ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే రెడీ అయ్యింది.. ఈ మేరకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని తచ్చూరు వరకు 116 కిలోమీటర్ల హైవే అందుబాటులోకి రానుంది. ఈ హైవే 116 కిలోమీటర్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఏకంగా 95 కిలోమీటర్లు ఉంది. ఈ హైవేను బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి అనుసంధానం చేశారు అధికారులు.ఆంధ్రప్రదేశ్‌లో మరో గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు నుంచి తమిళనాడును కనెక్ట్ చేసే.. చిత్తూరు–తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ట్రయల్ రన్ నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఈ హైవేపైకి వాహనాలను అనుమతించారు. ఈ హైవేలో సుమారు 100 కి.మీ వేగంతో వెళితే దాదాపు గంటన్నరలోనే తమిళనాడుకు, పోర్టుకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేశారు. త్వరలోనే ఈ హైవేపైకి వాహనాలను పూరిస్థాయిలో అనుమతించనున్నారు.. టోల్ రుసుము వసూలు చేయనున్నారు. ఈ హైవే మొత్తం 116 కిలోమీటర్లు ఆరు లైన్లుగా ఉంటే.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే 95 కిలో మీటర్లు ఉంది.. మిగిలిన 21 కిలోమీటర్లు తమిళనాడులో ఉంది.చిత్తూరులోని మాపాక్షి దగ్గర ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది.. ఆ తర్వాత గంగాధర నెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, నగరి మీదుగా కొనసాగుతుంది. అక్కడి నుంచి తమిళనాడులోని ఎంటరై ఊతుకోట్టై వరకు.. మళ్లీ అక్కడి నుంచి కట్టుపల్లి పోర్టు వరకు హైవే ఉంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను కర్ణాటక నుంచి వచ్చే భారీ వాహనాలు తమిళనాడులోని పోర్టుకు చేరుకునేందుకు వీలుగా నిర్మించారు. ఈ హైవేలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు చిత్తూరు, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజపురం, నగరి దగ్గర మాత్రమే ఉంటాయి.నగరి, ఎస్‌ఆర్‌పురం, అనుపల్లె, అరతల, నరసింహాపురం, పల్లిపట్టు, ఊతుకోట, కుమారరాజపేట, వీరకావేరిరాజపురం, పొందవాక్కం దగ్గర ఇంటర్ చేంజ్‌లు ఉంటాయి. ఈ హైవే దాదాపుగా పనులన్నీ పూర్తి కావడంతో ట్రయల్ రన్ నిర్వహించారు. త్వరలోనే ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వాహనాలను అనుమతించనున్నారు. ఈ గచిత్తూరు– తచ్చూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్ని 2022లో రూ.4వేల అంచనా వ్యయంతో నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను బెంగళూరు– చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి కనెక్ట్ చేశారు. ఈ హైవేతో చెన్నై, బెంగళూరు వెళ్లేవారికి ఊరట దక్కింది.బెంగళూరు– చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కూడా చిత్తూరు మీదుగా వెళుతోంది. ఇప్పటికే ఈ హైవేలో బెంగళూరు– వి.కోట మధ్య రాకపోకలకు అనుమతించారు. మొగిలి ఘాట్ దగ్గర పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ లోపు ఆ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు.. బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె, బంగారుపాళ్యం మండలం మొగిలి, గుడిపాల మండలం రామాపురం దగ్గర ఉన్నాయి.


# అమరావతిలో లెక్క తప్పిన వైసీపీ

**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. దీనిపై కూటమి పార్టీలు చాలా దూకుడుగా రాజకీయంగా ఎత్తులు వేస్తూ గేమ్‌లో పైచేయి సాధించాయి. కానీ ఈ విషయంలో వైసీపీ మాత్రం మరోసారి సెల్ఫ్‌గోల్స్‌తో మరోసారి అబాసుపాలైంది. అమరావతి అనే ఎమోషన్‌ను క్యారీ చేయడంలో కూటమి పార్టీలు ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయిందని చెప్పవచ్చు. ఈ విషయంలో విధానం అంటూ లేకుండా వైసీపీ తీవ్రంగా విమర్శలు పాలైంది. ఈ బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వచ్చే సందర్భంలో కూడా తన వాదనను బలంగా చెప్పలేకపోయింది. అన్ని పార్టీలు ముక్తకంఠంతో అమరావతికి జై కొడితే ఒక్క వైసీపీ మాత్రమే తన స్టాండ్ ఏంటో చెప్పలేక చతికిలపడింది. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ జరుగుతున్న టైంలో శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ, టీడీపీ లీడర్లంతా గ్యాలరీల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు లోక్‌సభ ఎంపీలంతా కూడా అక్కడ కూర్చొని చర్చ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇది చూడటానికి సాధారణ విషయమే కావచ్చు కానీ, ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ అమరావతిపై వారికి ఉన్న ఎమోషన్ ఎలాంటిదో అంటూ కితాబు ఇచ్చారు. దీని అక్కడ ఉన్న వారంతా చప్పట్లు కొడుతూ స్వాగతించారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత అందరూ లేచి సభకు నమస్కరించారు. హర్షధ్వానాలు చేశారు. అక్కడి వారంతా జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో అమరావతి అనే ఎమోషన్‌ను పార్లమెంట్‌లో క్యారీ చేయడంలో కూటమి పార్టీలు, ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయ్యింది. అందుకే అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు ఇచ్చారు. ఎన్డీఏ, ఇండి కూటమి పార్టీలు అన్నీ జై అమరావతి అని నినదించాయి. ఇంతటి కీలకమైన ఘట్టంలో వైసీపీ పాత్ర లేకుండా పోయింది. దీనికి ఆ పార్టీ కన్ఫ్యూజన్ స్టాండే కారణం. సందర్భానుసారం స్టాండ్ మారుస్తూ అటు పార్టీ క్యాడర్‌ను, ఇటు ప్రజలను డైలమాలో పడేసింది. అసలు అమరావతిని వ్యతిరేకిస్తున్నారో చెప్పలేదు. సమర్థిన్నారో చెప్పడం లేదు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎత్తున్న మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు కొత్తగా మావిగన్ అంటూ సరికొత్త పల్లవి అందుకుంది. రోజుల వ్యవధిలోనే రకరకాల రంగులు మార్చి అటు సభల్లో ఇటు ప్రజల్లో చులకనైంది. తెలంగాణ ఏర్పాటుకు టీడీపీ వ్యతిరేకమా అనుకూలమా అంటే పార్టీ అధిష్ఠానం నాడు రక్కున సమాధానం చెప్పలేని పరిస్థితి. 2009లో తెలంగాణకు జై కొట్టిన తర్వాత మళ్లీ ప్లేట్ మార్చింది. ఇక్కడ ఆంధ్రప్రాంతంలో జై సమైక్యాంధ్ర నినాదం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కోవాలని కోరడం, చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతం ఇలా భిన్నమైన స్టాండ్‌తో జనాలను కన్ఫ్యూజ్ చేసింది. అదే తర్వాత తెలంగాణ పార్టీ తుడిచిపెట్టుకుపోవడానికి ఒక కారణం అయ్యింది. అయితే చివరకు క్లైమాక్స్‌లో మాత్రం తెలంగాణకు అనుకూలంగా లెటర్ ఇచ్చి తెలంగాణకు జై కొట్టినా ప్రయోజనం లేకపోయింది. ఆ పార్టీపై ప్రజలకు అనుమానం అలానే ఉండిపోయింది. ఇప్పుడు వైసీపీ అదే స్థితిలో ఉంది. 2019కు ముందు అమరావతికి జగన్‌తోపాటు పార్టీ నేతలంతా జై కొట్టారు. అధికారంలోకి వస్తే టీడీపీ చేసిన దానికంటే ఎక్కువ చేస్తామనీ హామీలు ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లేట్ ఫిరాయించింది. మూడు రాజధానులు అంటూ సరికొత్త మ్యూజిక్ స్టార్ట్ చేసింది. అంతే రాజధాని ప్రాంత రైతులంతా రోడ్లపైకి వచ్చారు. అధికారంలో ఉన్న వైసీపీ నాడు వారికి పోటీగా మూడు రాజధానులు కావాలనే వాదనలో అమరావతిలోనే ప్రత్యేక ధర్నా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. కనీసం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలేంటీ, మూడు రాజధానుల విధానం ఎందుకు ఎంచుకున్నామో
అనే విషయాన్ని వివరించే ప్రయత్నం చేయలేదు. ఉక్కుపాదం మోపి ఉద్యాన్ని అణచివేయాలని చూశారు. వారిపై తీవ్రమైన విమర్శలు చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. ఇలా చేసి వారిపై సానుభూతి వచ్చేలా చేశారు. అప్పటి వరకు రాజధాని రైతులు గురించి పెద్దగా పెట్టించుకోని వారంతా కూడా తెలుసుకోవడం మొదలు పెట్టారు. డబ్బులు తీసుకోకుండా ప్రభుత్వంపై నమ్మకం భూములు ఇచ్చిన రైతుల పట్ల ప్రభుత్వం ఇలా ప్రవర్తిస్తుందా అనేలా వైసీపీ చేసింది. దీంతో అప్పటి వరకు లేని ఒక ఎమోషన్ కనెక్షన్ వారితో ఏర్పడింది. వీటికి తోడు వైసీపీ ఎత్తుకున్న మూడు రాజధానులను ముందుకు తీసుకెళ్లేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైజాగ్‌లో రుషి కొండను బద్దలు కొట్టి కట్టుకున్న ప్యాలెస్ కూడా నెగెటివ్ భావన వచ్చింది. 2024 ఎన్నికల్లో మూడు రాజధానులను ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కూడా వైసీపీ అంగీకరించడం లేదు. అలాగనే మూడు రాజధానులకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నామని చెప్పడానికి కూడా ముందుకు రావడం లేదు. ఎన్నికల వరకు మూడు రాజధానులు అంటూ ప్రచారం చేసిన ఆ పార్టీ తర్వాత సైలెంట్ అయిపోయింది. అమరావతిలో అభివృద్ధి జరగడం లేదని సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది. ఇప్పుడు తేల్చుకోవాల్సిన వచ్చిన సందర్భంలో కూడా అసెంబ్లీకి వెళ్లకుండా, పార్లమెంట్‌లో వాదన గట్టిగా వినిపించకుండా తేలిపోయింది.అమరావతికి అనుకూలంగా ఉన్నామంటూనే బిల్లును వ్యతిరేకిస్తున్నామని అటూఇటూ కాని స్టేట్మెంట్‌తో అబాసుపాలైంది. లోక్‌సభలో, రాజ్యసభలో రెండింటిలో అన్ని పార్టీలు అమరావతి వర్ధిల్లాలంటూ దీవిస్తుంటే వైసీపీ మాత్రం శాపనార్థాలు పెట్టి బయటకు వచ్చేసింది. అన్నింటికి తోడు జగన్ చేసిన మావిగన్ కూడా తీవ్ర విమర్శలకు ట్రోలింగ్‌కు గురైంది. చంద్రబాబు విమర్శించినట్టు అమరావతి అనడం కూడా జగన్‌కు ఇష్టం లేదని అందుకే పూటకో నినాదం చేస్తున్నారని అన్నట్టుగానే వారి తీరు ఉంది. ఇలా అడుగడుగునా తప్పుల మీద తప్పులు చేస్తూ అమరావతి ప్రాంతానికే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు వైసీపీ దూరంగా జరిగిపోయింది. అందుకు భిన్నంగా టీడీపీ. అమరావతి రాగం ఎత్తుకున్నప్పటి నుంచి వారి పార్టీ లీడర్లంతా ఒకటే మాటపై ఉన్నారు. జగన్ మూడు రాజధానుల ఎత్తుగడను కూడా లెక్క చేయకుండా అన్ని ప్రాంతాల్లో ఒకే నినాదం ఉండేలా చూసుకున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రాజధానికి పైస ఆశించకుండా రైతులు భూములు ఇచ్చిన విషయాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలికంగా అని చెప్పి కొన్ని బిల్డింగ్స్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు టీడీపీ నేతలు ఎవరూ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నించ లేదు. విజిటింగ్ లీడర్స్ అంటూ విమర్శలు ఎదురైనా వాటిని తట్టుకొని నిలబడ్డారు. అక్కడ వైజాగ్‌లో జగన్ తన కోసం ప్యాలెస్ రెడీ చేసుకోవడం, ఇక్కడ చంద్రబాబు తనకంటూ ఇంటిని నిర్మించుకోకపోవడం కూడా కలిసి వచ్చింది. సంక్షోభంలోనే అవకాశాలు వెతుక్కునే చంద్రబాబు అమరావతి రైతుల ఉద్యమం, నాటి ప్రభుత్వం వారిని చిత్రవధ చేసిన పరిణామాలను తనకు రాజధానికి అనుకూలంగా ప్రజలను ఏకం చేయడానికి చేసుకున్నారు. అమరావతి రైతులను టీడీపీ వదిలేస్తుందని ప్రచారం చేసిన వైసీపీ అక్కడి రైతులను పట్టించుకోకుండా తప్పుల మీద తప్పులు చేసింది. రైతులను పట్టించుకోదని విమర్సలు ఎదుర్కొన్న టీడీపీ మాత్రం వారిని నమ్ముకొని, ఉద్యమాలు చేసి సెంటిమెంట్‌ను రాజేసి రాష్ట్ర ప్రజలందరితో జై అమరావతి అనేలా చేసింది. రాష్ట్ర ప్రజలతోనే యావత్ దేశ ప్రజలతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమే అని నినదించేలా చేసింది. అమరావతి నినాదాన్ని పట్టుకొని టీడీపీ వంద మెట్లు పైకి ఎగబాగితే, పూటకో నినాదంతో వైసీపీ మరింత కిందికి జారిపోయింది.



# రాంగ్ ట్రాక్ లో తమ్ముళ్లు.. దారికి తెచ్చే పనిలో సీఎం

**గుంటూరు, ఏప్రిల్ 3, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎమ్మెల్యేలు, అధికారుల మధ్య సమన్వయం కుదరడం లేదన్న విమర్శలు పెరిగిపోతున్నాయి. తాము చెప్పిన పనులు జరగడం లేదని, అధికారుల నుండి సరైన గౌరవం దక్కడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఏకంగా పది గంటల పాటు ధర్నాకు దిగడం, గదిలో బంధించుకుని నిరసన తెలపడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. తాము సిఫార్సు చేసిన వారికే పోస్టింగ్ ఇవ్వాలన్న పట్టుదల, అధికారులపై ఒత్తిడి తేవడం వంటి పరిణామాలు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని పార్టీ అధిష్టానం భావిస్తోంది.ఎమ్మెల్యేల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ ఉద్రేకాలకు అడ్డుకట్ట వేసేందుకు సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్యేలందరూ తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని, నిరంతరం ఒత్తిడికి గురవుతున్న వారు మెడిటేషన్ చేయాలని ఆయన సూచించారు. గతంలో కూడా చంద్రబాబు తన కేబినెట్ సహచరులకు, అధికారులకు ఈషా ఫౌండేషన్ వంటి ఆధ్యాత్మిక సంస్థల ద్వారా యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం ఉంది. ఇప్పుడు మళ్ళీ అదే పద్ధతిలో ఎమ్మెల్యేల మనసులను ప్రశాంతం చేయాలని, వారు ప్రజల మధ్య సంయమనంతో ఉండేలా చేయాలని బాబు భావిస్తున్నారు.చాలామంది ఎమ్మెల్యేలు తాము గెలిచిన నియోజకవర్గాలకు మేమే కింగులం అనే భావనలో ఉండటం వల్లే ఇలాంటి ఘర్షణలు తలెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికారులపై హుకుం జారీ చేయడం, వారి గౌరవానికి భంగం కలిగించడం ద్వారా పనులు జరగవని, అది కేవలం అరాచకానికి దారితీస్తుందని చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. పెన్షన్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అధికారం అంటే బాధ్యత అని, అది అహంకారానికి వేదిక కాకూడదని హితవు పలికారు. ధ్యానం ద్వారా ఎమ్మెల్యేలలో ఉన్న ఆ అహంకారాన్ని తొలగించి, వారిని సేవా మార్గంలోకి మళ్లించడమే బాబు లక్ష్యంగా కనిపిస్తోంది.
చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయాల ముందు ధర్నాలు చేయడం వంటి చర్యలు గత ప్రభుత్వం చేసిన తప్పులను గుర్తు చేస్తున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఈసారి కేవలం హెచ్చరికలతోనే సరిపెట్టకుండా, ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా పెట్టడమే కాకుండా వారికి మానసిక వికాస తరగతులు నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. ఒకవేళ ధ్యానం, యోగా వంటి శిక్షణల తర్వాత కూడా ఎమ్మెల్యేల తీరు మారకపోతే, కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టమైన సంకేతాలు పంపారు.ప్రస్తుత రాజకీయాల్లో కేవలం గెలిస్తే సరిపోదు, ప్రజల ముందు ఎలా ప్రవర్తిస్తున్నామనేది కూడా ముఖ్యమని చంద్రబాబు నమ్ముతారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేలందరికీ ప్రొఫెషనల్ ట్రైనర్లతో వర్క్‌షాప్‌లు నిర్వహించే అవకాశం ఉంది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కంటే కూడా నాయకుల ప్రవర్తనే ఎన్నికల్లో కీలకం కానుందని, అందుకే ఎమ్మెల్యేలు తమ బాడీ లాంగ్వేజ్ ను మార్చుకుని, అధికారులతో కలిసి పనిచేయాలని అధిష్టానం నిర్దేశించింది. ఈ మెడిటేషన్ మంత్రం ఎంతవరకు ఎమ్మెల్యేలలో మార్పు తెస్తుందో వేచి చూడాలి.



## కార్పొరేషన్లలో పెరుగుతున్న డివిజన్లు

**విశాఖపట్టణం, ఏప్రిల్ 3, పెన్ పవర్:** ఏపీలోని పలు కార్పొరేషన్లలో భారీగా వార్డులను పెంచుతూ కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఏపీలో అత్యధిక వార్డులు ఉన్న కార్పొరేషన్ గా మహా విశాఖ నగర పాలక సంస్థ జీవీఎంసీ నిలిచింది. అక్కడ 98 నుంచి ఏకంగా 120 దాకా వార్డులు పెరిగాయి. ఆ తరువాత స్థానంలో విజయవాడ కార్పొరేషన్ ఉండబోతోంది. ఇక్కడ 64 వార్డులు ఉండేవి, వాటిని 86 వార్డులుగా పెంచారు. ఇక మూడవ స్థానంలో గుంటూరు కార్పోరేషన్ ఉంది. ఇక్కడ 57 వార్డులు ఉంటే దానికి 76 వార్డులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఏపీలో ఉన్న 13 కార్పొరేషన్లలో వరస ప్రకారం చూస్తే పెరిగిన వార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులో 54 వార్డులు ఉంటే అవి కాస్తా 72 వార్డులు అవుతున్నాయి. కర్నూల్ కార్పొరేషన్ కి 52 వార్డులు ఉంట్టే 68 వార్డులుగా పెరుగుతున్నాయి. తిరుపతికి 50 వార్డులు ఉంటే 66 వార్డులుగా మారుతున్నాయి. కడపకు 50 వార్డులు ఉంటే అవి 66కి చేరుకున్నాయి. ఏలూరుకి 50 వార్డులు ఉంటే 62 వార్డులుగా చేశారు. అనంతపురం కార్పోరేషన్ కి 50 వార్డులు ఉంటే 62గా చేశారు. ఒంగోలుకి 50 వార్డులు ఉంటే 62గా, విజయనగరంలో 50 వార్డులు ఉంటే 62గా చేశారు. చిత్తూరు కార్పోరేషన్ కి 50 వార్డులు ఉంటే 60గా మచిలీపట్నానికి 50 వార్డులు ఉంటే 60 గా పెంచారు. ఇలా చూసుకుంటే మొత్తం పెరిగిన వార్డులు రాష్ట్రవ్యాప్తంగా 197 గా ఉన్నాయి. దీంతో ఎంతో మంది ఆశావహులకు పోటీ చేసేందుకు అవకాశం లభిస్తోంది. కార్పోరేటర్ గా కీలకమైన పదవులలో వారు కూర్చునేందుకు మహత్తరమైన చాన్స్ గా ఇది ఉండబోతోంది. కేవలం కార్పోరేషన్లకే కాదు మునిసిపాలిటీలకు కూడా వార్డులను రాష్ట్రవ్యాప్తంగా పెంచుతున్నారు. దాంతో వందకు పైగా ఉన్న మునిసిపాలిటీలలో కూడా ఈ పెంపు వల్ల అంతకు నాలుగైదింతలు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు మొత్తం మీద చూస్తే కనుక ప్రస్తుతం పట్టణ స్థానిక సంస్థలలో ఇప్పటిదాకా ఉన్న ప్రజా ప్రతినిధులకు తోడుగా మరో ఇరవై నుంచి పాతిక శాతం అదనంగా చేరుతారు అని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉన్నాయి. ఎంతో మంది స్థానిక ఎన్నికల్లో పోటీకి తయారుగా ఉన్నారు. ఇపుడు వీరంతా పోటీకి బంగారు అవకాశం లభిస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాజకీయ ఆశావహులలో పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం అవుతోంది.

## తమ్ముళ్లలో అసంతృప్తి

**నెల్లూరు, ఏప్రిల్ 3, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు అయిపోతుంది. పవర్‌లోకి వచ్చాం సరే..పదవుల మాటేమిటని తెలుగు తమ్ముళ్లు ఎదురు చూస్తూనే ఉన్నారు. నామినేటెడ్ పోస్ట్ అయినా, పార్టీ పదవి అయినా..పార్టీ కోసం పనిచేసిన వారికే ఇవ్వాలంటున్నారు. అయితే ఎన్నికలకు ముందు..ఆ తర్వాత వైసీపీతో సహా వివిధ పార్టీల నుంచి వచ్చి టీడీపీలో చేరిన లీడర్లకు..పదవులు దక్కుతుండటం..తెలుగు తమ్ముళ్లకు ఏ మాత్రం మింగుడు పడటం లేదట. అసలే కూటమి పొత్తులో భాగంగా షేరింగ్‌లో పదవులు దక్కడం లేదన్న ఫీలింగ్‌లో ఉంటే..వలస నేతలను పెద్దపీట వేస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట.తెలుగు భాషా పాతాలుమరీ ముఖ్యంగా వైసీపీ లీడర్లకు పదవులు కట్టబెట్టడాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేక ..అధిష్టానంకు ఫిర్యాదులు చేస్తున్నారట. జంపింగ్‌లను నమ్మి పదవులు కట్టబెడితే పార్టీని ముంచేస్తారని చెబుతున్నారట. దీంతో పార్టీ, లోకల్‌గా నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ హైకమాండ్ ఒత్తిళ్లు ఫేస్ చేయాల్సి వస్తోందట. ఓవైపు సీనియర్లు..ఇంకోవైపు క్యాస్ట్ ఈక్వేషన్స్, మరోవైపు పార్టీ కోసం కష్టపడ్డోళ్లు, పార్టీని నమ్ముకుని వచ్చిన నేతలు ..ఇలా అందరికి పదవులు ఇవ్వడం ఇబ్బందిగానే ఉందట.టీడీపీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో..ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తి బయటపడిందని అంటున్నారు. ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి కీలక పదవులు ఇవ్వడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారట సైకిల్ పార్టీ నేతలు. పార్టీలో సంస్థాగతంగా పదిహేను ఏళ్ల నుంచి సేవ చేస్తున్నామని..ఆస్తులను అమ్ముకుని కూడా పార్టీ కోసం ఖర్చు చేసిన నాయకులు ఉన్నారని, అలాంటి వారికి పదవులు ఇవ్వాలని సూచించారట. క్షేత్రస్థాయిలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు వంటి పదవులను వైసీపీ నుంచి వచ్చిన కొందరికి ఎమ్మెల్యేలు సిఫారసు చేయటంపై అసంతృప్తి వ్యక్తం చేశారట. తమ ఎమోషన్స్‌కు విలువ ఇవ్వకుండా పదవులు ఇచ్చేస్తే ఎలా అని క్వశ్చన్ చేసినట్లు తెలుస్తోంది.ఒకటి రెండు చోట్ల నుంచి పార్టీకి ఫిర్యాదులు కూడా అందాయట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు పార్టీపై ప్రేమ ఉంటుందా? లేక పదవులపైనే ప్రేమ ఉంటుందో అధిష్టానం ఆలోచించుకోవాలని కూడా సూచనలు చేశారట. పార్టీని నమ్ముకుని పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పారట. అయితే ఎమ్మెల్యేల సిఫారసులకే పార్టీ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడంతో సమస్య వచ్చి పడిందంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని పొరపాట్లు జరిగాయని అటు చంద్రబాబు, ఇటు లోకేశ్ అలర్ట్ అయినట్లు టాక్ నడుస్తోంది.ఇక నుంచి అలా జరగదు. మాది భరోసా అంటూ లీడర్లకు భరోసా ఇచ్చారట చంద్రబాబు, లోకేశ్. పార్టీ కోసం పని చేసేవాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు టీడీపీ అధినేత. కార్యకర్తలను దూరం పెట్టే నేతలను తాను దూరం పెడతానని తేల్చి చెప్పడం వెనుక కారణం అదేనంటున్నారు. కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేశ్‌దేనని చెప్పారు. ఇక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చే వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. క్యాడర్, లీడర్లే టీడీపీ భవిష్యత్ నాయకులన్న లోకేశ్..గ్రామ స్థాయి నాయకుడు బాగా పనిచేస్తే పొలిట్ బ్యూరోలో కూర్చోబెడుతామంటున్నారు. రాబోయే పొలిట్ బ్యూరోలో మీరు ఆ మార్పును చూడబోతున్నారని కూడా చెబుతున్నారు.మొత్తం మీద లీడర్ల నుంచి వచ్చిన సజీషన్స్‌ను విన్నాకే..వలస నేతలు..ఎస్పెషల్‌గా వైసీపీ నుంచి వచ్చిన లీడర్ల విషయంలో అలర్ట్‌గా ఉండాలని లోకేశ్ సూచించారని అంటున్నారు.

## పర్ఫెక్ట్ ప్లాన్ తో పవన్...



**విజయవాడ, ఏప్రిల్ 3, పెన్ పవర్:** ట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. ముఖ్యంగా ఆయన ఆధ్వర్యం లో నడుస్తున్న పంచాయితీ రాజ్ శాఖ దేశం లోనే నెంబర్ 1 స్థానం లో నిల్చింది. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు.అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళు_ంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది.అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియంట్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆధ్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్ కళ్యాణ్.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## పాకిస్థాన్‌లో లీటర్ డీజిల్ రూ. 520..

**హైదరాబాద్ పెన్ పవర్:** పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఇంధన ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలపై అక్కడి ప్రభుత్వం పెట్రో భారం మోపింది. పెట్రోల్, డీజిల్ ధరలను రికార్డు స్థాయిలో పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు శుక్రవారం, ఏప్రిల్ 3 నుంచి తక్షణమే అమల్లోకి వచ్చాయి.తాజా పెంపుతో లీటర్ హై-స్పీడ్ డీజిల్ ధర ఏకంగా రూ. 184.49 (54.9 శాతం) పెరిగి రూ. 520.35కు చేరింది. అదేవిధంగా, పెట్రోల్ ధర లీటర్‌పై రూ. 137.23 (42.7 శాతం) పెరిగి రూ. 458.40కు ఎగబాకింది. నెల రోజుల వ్యవధిలో పాకిస్థాన్‌లో ఇంధన ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయని, ఈ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పడం లేదని పాక్ ప్రభుత్వం తెలిపింది. ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్, పెట్రోలియం శాఖ మంత్రి అలీ పర్వైజ్ మాలిక్ గురువారం రాత్రి మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. "అంతర్జాతీయ ధరల భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పదు, అయితే బలహీన వర్గాలపై ప్రభావాన్ని తగ్గించడానికి ఉపశమన చర్యలను తీసుకుంటాము" అని ఆర్థిక మంత్రి ఔరంగజేబ్ పేర్కొన్నారు. భారీ పెంపు నుంచి సామాన్యులకు కొంత ఊరట కల్పించేందుకు ప్రభుత్వం లక్షిత సబ్సిడీలను ప్రకటించింది. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనదారులకు మూడు నెలల పాటు నెలకు 20 లీటర్ల వరకు లీటర్‌పై రూ. 100 సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపింది. దీంతో పాటు చిన్న రైతులు, ప్రజా రవాణా వాహనాలకు కూడా ఉపశమన చర్యలు ప్రకటించింది.

## హార్ముజ్ గురించి 'అన్ని పక్షాలతో' చైనా సంప్రదింపులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హార్ముజ్ జలసంధి స్థిరత్వాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం గురించి తాము అన్ని పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నామని చైనా తెలిపింది. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివరించింది. "హార్ముజ్ జలసంధి, దాని సమీప జలాల్లో త్వరితగతిన కాల్పుల విరమణ, శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడం అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ఆకాంక్ష అని మేము విశ్వసిస్తున్నాం. అన్ని పక్షాలూ ఈ లక్ష్యం కోసం కృషి చేయాలి" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ అన్నారు. చైనా అన్ని పక్షాలతో సంప్రదింపులు, సమన్వయం కొనసాగిస్తోందని చెప్పారు. హార్ముజ్ జలసంధిలో నౌకాయానానికి అంతరాయం కలగడానికి మూల కారణం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ తీసుకున్న చట్టవిరుద్ధమైన సైనిక చర్యలేనని మావో తెలిపారు. ఆ ప్రాంతంలో భద్రతను పునరుద్ధరించడానికి శత్రుత్వాన్ని అంతం చేయడమే మార్గమని ఆమె చెప్పారు. సైనిక మార్గాల ద్వారా ఈ సమస్యను పరిష్కరించలేమనీ, సంఘర్షణ తీవ్రతరం కావడం ఏ పక్షానికీ ప్రయోజనకరం కాదని వివరించారు.

## ఇరాన్‌లో సాధించాల్సింది ఏముంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముందని ప్రశ్నించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత ఉండాలని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో చేసిన ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, దాని పొరుగుదేశాలకు హాని కలగకుండా ఉండేందుకు ఆ దేశ సైనిక సామర్థ్యాలను తగ్గించాలనే ప్రాథమిక లక్ష్యాలకు అమెరికాకు తాము కూడా మద్దతిచ్చినట్టు అల్బనీస్ తెలిపారు. యుద్ధంలో ఆ లక్ష్యాలు నెరవేరాయన్నారు. అయినా.. యుద్ధం కొనసాగించడానికి ఇంకా అక్కడ సాధించాల్సింది ఏముందని ఆయన ప్రశ్నించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత లేదన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం అంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే ప్రశ్నకు.. ఇది ప్రారంభమవడానికి ముందు తమను ఎవరూ సంప్రదించలేదని అల్బనీస్ బదులిచ్చారు.

## ఏప్రిల్‌లో చమురు సరఫరాలో అంతరాయం రెట్టింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** హార్ముజ్ జలసంధి మూసివేతతో ఏప్రిల్‌లో చమురు సరఫరాలో అంతరాయం రెట్టింపు కానుందని, ఐరోపాపై కూడా తీవ్ర ప్రభావం పడనుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) అధ్యక్షుడు ఫతిహ్ బిరోల్ బుధవారం పేర్కొన్నారు. ఎల్ఎన్‌జి నష్టానికి అదనంగా, ఏప్రిల్‌లో చమురు నష్టం మార్చి కన్నా రెట్టింపు కానుందని అన్నారు. ప్రస్తుతం ప్రధానంగా జెట్ ఇంధనం, డీజిల్ కొరత ఆసియాదేశాల్లో చూస్తున్నామని, ఏప్రిల్ లేదా మేలో ఈ సంక్షోభం ఐరోపాను కూడా చుట్టుముట్టనుందని అన్నారు. నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిఇఓ నికోలాయ్ టాంగెన్‌తో ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న బిరోల్ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఇప్పటివరకు రోజుకు 12 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోయిందని అన్నారు. యుద్ధంతో మధ్యప్రాచ్యంలో సుమారు 40 కీలక ఇంధన వనరులు దెబ్బతిన్నాయని అన్నారు. జెట్ ఇంధనం, డీజిల్ కొరత ప్రస్తుతం ఉన్న అతిపెద్ద సమస్యలని, ఒక వేళ ముడి చమురు సంక్షోభం ఏర్పడితే ఐఇఎ జోక్యం చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఇంధన కొరతను, ధరల పెరుగుదలను భర్తీ చేసేందుకు వ్యూహాత్మక నిల్వల నుండి రికార్డు స్థాయిలో చమురు నిల్వలను విడుదల చేసేందుకు అంగీకరించిన సంగతి తెలిసిందే.

## హార్ముజ్ మార్గంలో సముద్ర భద్రతకు ఏకతాటిపైకి 35 దేశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ పేర్కొన్నారు. 35 దేశాలను ఏకతాటిపైకి తీసుకువచ్చామని బుధవారం తెలిపారు. కీలకమైన చమురు రవాణా మార్గంలో సముద్ర భద్రతను పునరుద్ధరించడానికి కలిసి పనిచేస్తామని 35 దేశాలు ఒక ప్రకటనపై సంతకం చేశాయని అన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, నెదర్లాండ్స్ దేశాలు ఈ ప్రకటనపై సంతకం చేశాయని చెప్పారు. ఈ యుద్ధ ప్రభావం ఒకతరం పాటు ఉండనుందని, అలాగే 1970లలో ఇంధన ధరల పెరుగుదల మాదిరిగానే ఉండవచ్చని అన్నారు. జలసంధిని తిరిగి తెరిచే మార్గాలపై చర్చల కోసం ఈవారం బ్రిటన్‌లో అంతర్జాతీయ దౌత్యసదస్సు జరగనుందని అన్నారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడానికి, చిక్కుకుపోయిన నౌకలు, వస్తువుల రవాణాను పునరుద్ధరించడానికి దౌత్య, ఆచరణీయ రాజకీయ చర్యలపై ఈ సదస్సు చర్చిస్తుందని అన్నారు. యుద్ధం ముగిసిన అనంతరం మన సామర్థ్యాలను ఎలా సమీకరించుకోవాలి, హార్ముజ్ జలసంధిని ఎలా అందుబాటులోకి తీసుకురావాలి, ఏవిధంగా సురక్షితంగా మార్చాలి అనే అంశాలను పరిశీలించేందుకు సైనిక ప్రణాళికవేత్తలతో కూడా చర్చలు జరుపుతామని అన్నారు.

# అటార్నీ జనరల్ పదవి నుండి పామ్ బోండీని తొలగించిన ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధదించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ ద
సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పోరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను డోజ్ (అమెరికా న్యాయవ్యవస్థ ) జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధంపై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

# పునర్నిర్మాణానికి నడుం బిగించండి



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా- ఇజ్రాయిల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశవ్యాప్త కార్యక్రమం చేపట్టాలని నిర్దేశించారు. ఇస్లామిక్ గణతంత్ర దినోత్సవం, జాతీయ ప్రకృతి దినం సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ఒక సందేశం విడుదల చేశారు. అమెరికా- ఇజ్రాయిల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా తీవ్రంగా ఖండించారు. ఇరాన్ అభివద్ధిని విస్తరించడం, ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌లోని మినాబ్ పాఠశాలపై జరిగిన దాడి గురించి మొజ్తాబా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఘటనలో 186 మంది ప్రాణాలు కోల్పోయారని, వీరికి నివాళిగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. టెహ్రాన్‌పై అమెరికా- ఇజ్రాయిల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధం 34వ రోజుకు చేరుకుంది. ఇరుదేశాల పరస్పర దాడుల వల్ల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై అమెరికా జరిపే ఏ భూతల దాడినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ గురువారం ప్రకటించారు. ఇందుకోసం 7 మిలియన్ల ఇరానీయులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అమెరికాతో సంప్రదింపుల భాగస్వామిగా పేరు వినిపిస్తున్న మహమ్మద్ బఘేర్ ఖాలిబాఫ్, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు సవాలు విసురుతూ వరుసగా ఆన్‌లైన్ పోస్టులు పెడుతున్నారు.

# మహిళా రిజర్వేషన్లు, ఎఫ్‌సిఆర్ఎ బిల్లుల కోసం

## పార్లమెంటు సమావేశాల పొడిగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే బడ్జెట్ సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో, మైనారిటీల హక్కులను కాలరాసేందుకు తీసుకొస్తున్న బిల్లుగా విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది.

## ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో గ్యాస్ కొరత లేదని, పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా తలెత్తే ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. కేరళలోని తిరువనంతపురంలో గురువారం జరిగిన 'సైనిక్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "సముద్ర వాణిజ్యానికి అత్యంత కీలక మార్గమైన హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న భారత చమురు నౌకలకు మన నౌకాదళం రక్షణ కల్పిస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగు దేశమైన పాకిస్థాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే భారత్ ప్రతిస్పందన ఊహించనిరీతిలో నిర్ణయాత్మకంగా ఉంటుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా ఉగ్రదాడులు జరిగాయి. వాటిపై ఆ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటోంది" అని రాజ్‌నాథ్ చెప్పారు. తమ దేశంపై రాజ్‌నాథ్ వ్యాఖ్యల్ని పాక్ రక్షణశాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఖండించారు. తమపై భారత్ ఎలాంటి దాడిచేసినా ఈసారి మరింత శక్తిమంతంగా.. నిశ్చయాత్మకరీతిలో బదులిస్తామని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపులు తమకు కొత్తకాదని

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు గురువారం నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)తో దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషే మాట్లాడుతున్నారని విచారణ సందర్భంగా భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుం టున్నారా? ఈ ఘటనను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదష్టకరం' అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎస్ఐఆర్ పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్ విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి
మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ విషయంలో తాను చేసేదేమీ లేదని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో కీలుబొమ్మగా నడుస్తున్న ఎన్నికల సంఘమే ప్రస్తుతం రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు చూస్తోందని, ఈ ఘటనలకు ఇసిదే బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# యుద్ధ సెగతో తయారీ రంగం కుదేలు



అమెరికా యుద్ధోన్మాదం, అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోన్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణతో మార్చి నెలలో తయారీ రంగ పీఎంఐ 53.9కి పడిపోయిందని హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. ఇంతక్రితం నెల ఫిబ్రవరిలో 56.9 పాయింట్లుగా ఉండగా.. మార్చి నాటికి అది ఒక్కసారిగా 53.9 పాయింట్లకు తగ్గి నాలుగేండ్ల కనిష్టానికి దిగజారింది. జూన్ 2022 తర్వాత నమోదైన అత్యల్ప ఉత్పత్తి ఇదే కావడం గమనార్హం. సాధారణంగా 50 పైన ఫఈఎంఐ ఉంటే మెరుగ్గా.. దిగువన ఉంటే ప్రతికూలంగా ఉన్నట్లుగా గుర్తిస్తారు. గత రెండేండ్లలో ఎప్పుడూ లేనంతగా కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం మందగించాయి. ముడిసరుకుల ధరలు మూడున్నరేండ్ల గరిష్టానికి చేరడం తయారీదారుల నడ్డి విరుస్తోంది. ఖర్చులు పెరిగినా పోటీ తట్టుకోవడానికి విక్రయ ధరలను పెంచలేకపోవడం వల్ల కంపెనీల లాభాలు ఆవిరవుతున్నాయి. డిమాండ్ తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి భారత పారిశ్రామిక వేగాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయని హెచ్ఎస్‌బీసీ విశ్లేషించింది. "తీవ్రమైన మార్కెట్ పోటీ, ముడిసరుకుల ధరల పెరుగుదల, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల కొత్త ఆర్డర్ల ప్రవాహం నెమ్మదించింది. ముఖ్యంగా అల్యూమినియం, రసాయనాలు, ఇంధనం, జనపనార, తోలు, వస్త్రాలు, ఉక్కు వంటి వస్తువుల ధరలు గత మూడేండ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. దీనివల్ల తయారీదారులపై పెట్టుబడి భారం పెరిగినప్పటికీ, వినియోగదారులకు చేరే తుది వస్తువుల ధరలను కంపెనీలు ప్రస్తుతానికి నియంత్రణలోనే ఉంచుతున్నాయి." అని హెచ్ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజల్ భండారీ పేర్కొన్నారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం 2022 మధ్య కాలం తర్వాత ఎన్నడూ లేనంత నిదానంగా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడం, మార్కెట్ పరిస్థితులు సవాలుగా మారడంతో డిమాండ్ భారీగా మందగించింది. ముడి ఖర్చులు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, ఉన్న కస్టమర్లను కాపాడుకోవడానికి, కొత్త వారిని ఆకర్షించడానికి కంపెనీలు తమ విక్రయ ధరలను పెంచలేకపోతున్నాయి. దీనివల్ల తయారీదారుల లాభాల మార్జిన్లు కుంచించుకుపోతున్నాయి. అంతిమంగా పెరుగుతున్న వ్యయాలు, తగ్గుతున్న డిమాండ్‌తో భారత పరిశ్రమలు కుదేలవుతున్నాయి.

# తీవ్ర ఆర్థిక సంక్షోభ దిశగా భారత్



దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా సాగుతోందని మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) అరవింద్ సుబ్రమణ్యం హెచ్చరించారు. యుద్ధం వల్ల చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా నిలిచిపోవడం వల్ల దేశ జిడిపి 1 శాతం పైగా పడిపోయి, ద్రవ్యోల్బణం 1.5 శాతం పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఎంతో కాలం కొనసాగవని, చివరికి సామాన్యుడిపై ధరల భారం పడక తప్పదని విశ్లేషించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన స్తబ్దత ముప్పులో ఉందన్నారు. అంతర్జాతీయంగా చమురు, సహజ వాయువు, ఎరువుల సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన భారత్ రెండంచుల నష్టాన్ని చవి చూడబోతోందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా రెస్టారెంట్లు మూతపడటం వంటి ఆర్థిక మందగమన సంకేతాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు.

ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కడానికి ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వీలైతే అక్కడ నుండి తక్కువ ధరకే ఇంధన, ఎరువుల నిల్వలను యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని సుబ్రమణ్యం సూచించారు. దేశీయంగా ఎక్సైజ్ సుంకాల కోత, సబ్సిడీల వంటి చర్యలు స్వల్పకాలిక ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ సుదీర్ఘ కాలం పాటు పెరిగిన భారాలను ప్రభుత్వం మోయలేదన్నారు. చివరికి ఆ భారం సామాన్య వినియోగదారుడిపైనే వేయనుందన్నారు. భారీ అప్పుల కారణంగా ప్రభుత్వాలకు ఆర్థికంగా నిలదొక్కుకునే శక్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో మరో ప్రధాన ప్రతికూలాంశమన్నారు. రూపాయి విలువ పతనం కావడం కూడా విధానకర్తలకు ఒక గట్టి సవాలేనని అన్నారు. ఈ సంక్షోభాన్ని ఒక గుణపాఠంగా భావించి, భవిష్యత్తులో శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్నారు.. దీర్ఘకాలిక వ్యూహంతో పునరుత్పాదక ఇంధన వనరులను పెంచుకోవడం, కీలక వస్తువుల వ్యూహాత్మక నిల్వలను నిర్మించుకోవడం ద్వారానే ఇలాంటి ప్రపంచ స్థాయి దిగ్బంధనాలను ఎదుర్కోగలమన్నారు.

# కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండండి



పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం ఫలితంగా సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడుతుండటంతో, మరింత కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండాలని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ గ్రూప్ కంపెనీలకు చెందిన 30 మందికి పైగా సీఈఓలు, మేనేజింగ్ డైరెక్టర్లకు సూచించారు. యుద్ధ పరిణామాలపై గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో.. టాటా గ్రూప్‌నకు సంబంధించి వోల్టాస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్, టైటన్ కంపెనీలకు చెందిన 10,000 మందికి పైగా టాటా ఉద్యోగులు పశ్చిమాసియా ప్రాంతంలో ఉన్నారని చంద్రశేఖరన్ తెలిపారు. వారిని తిరిగి రప్పించే చర్యలను వివరించారని ఒక అధికారి తెలిపారు. సరఫరా అంతరాయాలు, పెరుగుతున్న వస్తువుల ధరల వల్ల గిరాకీ తగ్గుతుందని, నిర్వహణ ఖర్చులు పెరిగి కంపెనీల లాభాలపై ఒత్తిడి పడుతుందని ఆయన వివరించారు. నగదు జాగ్రత్తగా నిర్వహించాలి: కంపెనీలు సామర్థ్యం కంటే తక్కువ ఉత్పత్తికి పరిమితం కావాలని, మౌలిక సదుపాయాల రంగం లేదా నిర్మాణ రంగ

కంపెనీల పనులు పూర్తవ్వడంలో ఆలస్యం చోటుచేసుకోవచ్చని తెలిపారు. గిరాకీ మందగించడం, సరఫరా అంతరాయాల వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కావడం, చమురు ధరల పెరుగుదల – కొరత, కరెన్సీ విలువ హెచ్చుతగ్గులు, లాజిస్టిక్స్ వ్యయాలు వంటి వాటితో కఠిన వ్యాపార వాతావరణానికి సిద్ధంగా ఉండాలని ఛైర్మన్ వారికి సూచించారు. నగదును జాగ్రత్తగా నిర్వహించడంపై దృష్టి సారించాలనీ వివరించారు. ప్రాజెక్టుల ప్రారంభ సమయాన్ని జాగ్రత్తగా ఎంచుకోవాలని, అవసరమైతే కాలపట్టికలను పునఃసమీక్షించుకోవాలని సలహా ఇచ్చారు.

# వరల్డ్ టాప్ 2 లో ఎయిర్‌టెల్




భారతదేశానికి చెందిన ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా 65 కోట్లకు పైగా చందాదార్లను (ాబీఎబఇతీతిఎవతీబ) కలిగి ఉండటం ద్వారా, చైనా మొబైల్ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం సేవల సంస్థగా ఎయిర్‌టెల్ అవతరించింది. జీఎస్ఎంఏ (ఊఓం) ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం.. వినియోగదారుల సంఖ్య పరంగా ఎయిర్‌టెల్ ఈ ఘనతను సాధించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. భారత్‌తో పాటు ఆఫ్రికాలోని 14 దేశాలలో విస్తరించిన ఎయిర్‌టెల్ నెట్‌వర్క్, తన వినియోగదారుల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటూ అంతర్జాతీయ వేదికపై పటిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది. మార్చి 31 నాటి గణాంకాలను పరిశీలిస్తే... కేవలం భారతదేశంలోనే ఎయిర్‌టెల్‌కు 46.4 కోట్ల మంది చందాదార్లు ఉన్నారు. ఇందులో 36.9 కోట్ల మొబైల్ వినియోగదారులు కాగా, మిగిలిన వారు బ్రాడ్‌బ్యాండ్, డిజిటల్ టీవీ మరియు ఐఓటీ (ఎమీ) సేవలను వాడుతున్నారు. ఇక ఆఫ్రికా ఖండంలోని 14 దేశాల్లో కలిపి దాదాపు 17.9 కోట్ల మంది వినియోగదారులు ఎయిర్‌టెల్ సేవలను వినియోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 కోట్ల మంది చందాదార్లతో 'చైనా మొబైల్' మొదటి స్థానంలో కొనసాగుతుండగా, ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. టెలికాం రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, విస్తరణ వేగం దృష్ట్యా, రాబోయే రోజుల్లో ఎయిర్‌టెల్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే అవకాశం ఉంది.

## పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించిన ప్రభుత్వం



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో పెట్రోకెమికల్ ముడిసరుకులపై ఆధారపడిన పరిశ్రమలకు కేంద్రం తాత్కాలిక ఉపశమన చర్యలను ప్రకటించింది.ప్రధానంగా వీటి ధరలు పెరిగితే, ప్రజలపై భారం పడుతుందనే కారణంతో ప్రభుత్వం పరిష్కార నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని మినహాయించింది. ఈ నిర్ణయం గురువారం(ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు పరిమిత కాలం వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయంగా పరిశ్రమలకు ముఖ్యమైన పెట్రోకెమికల్ ముడిసరుకు లభ్యత, సరఫరాకు ఇబ్బందుల్లేకుండా, వీటిపై ఆధారపడిన రంగాలకు ఖర్చుల భారం తగ్గించాలని భావిస్తున్నాం. దీనివల్ల కీలక ఫార్మా, ఆటో, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్, కెమికల్ రంగాలకు ప్రయోజనం కలుగుతుంది. సుంకం మినహాయింపు ఇచ్చిన పెట్రోకెమికల్స్‌లో మిథనాల్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, అన్‌శాచురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్, అన్‌హైడ్రస్ అమోనియా, స్టీరేన్ బ్యుటడిన్, డైక్లోరోమిథేన్, పాలీ బ్యూటడిన్ ఉన్నాయి. పాలిఇథిలీన్, పాలిప్రొపిలీన్, పాలిస్టైరీన్, పాలివినైల్ క్లోరైడ్, పాలిఇథిలీన్ టెరెఫ్తలేట్ చిప్స్ వంటి పాలిమర్లు ఉన్నాయి.

## మహీంద్రా కీలక నిర్ణయం.. ఏప్రిల్ 6 నుంచి పెరగనున్న ధరలు




మహీంద్రా వాహనాలు కొనుగోలు చేసే వారికి ఊహించని షాక్ తగిలింది. తమ వాహనాల ధరలను పెంచబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది మహేంద్రా అండ్ మహీంద్రా కంపెనీ. మార్కెట్లో మహేంద్రా కంపెనీకి మంచి డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. చాలా మంది, మిగతా కంపెనీలను కాదని ఈ మహేంద్ర కంపెనీకి సంబంధించిన కార్లు, ఇతర వాహనాలు కొనుగోలు చేస్తూ ఇంట్రెస్ట్ చూపిస్తారు. అయితే అలాంటి వారికి షాక్ ఇస్తూ, తాజాగా ఈ మహేంద్రాకు సంబంధించిన వాహనాల ధరలను అమాంతం పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. నాన్-ఎలక్ట్రిక్ ాజఎలు, వాణిజ్య వాహనాల ధరలను గరిష్టంగా 2.5% పెంచబోతున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఇక మొత్తం వాహన పోర్టు పోలియోపై ధరల పెంపు సగటున 1.6 పర్సెంటేజ్ ఉంటుందని వివరణ ఇచ్చింది మహేంద్రా కంపెనీ. ఇక పెంచిన ధరలు ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి అమలులోకి వస్తాయని కీలక ప్రకటన చేసింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకుగాను తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. ఇక ఈ పెంపుదల నేపథ్యంలో మోడల్, వేరియంట్ ను బట్టి వాహనాల ధర వేరువేరుగా పెరుగుతుంది. అటు ఇటీవల మహేంద్ర నుంచి వచ్చిన చీజఎ 7చీూ వెహికల్ ధర మాత్రం మొదటి నలభై వేల మంది కొనుగోలుదారులకు మాత్రమే పెరగబోదని స్పష్టం చేసింది. ఆ తర్వాత కొనుగోలు చేసిన వాళ్లందరికీ పెంపుదల వర్తిస్తుందని మహీంద్రా వెల్లడించింది.

## విమాన ప్రయాణికులకు షాక్.. 60 శాతం ఫ్రీ సీట్ల నిబంధనపై కేంద్రం వెనక్కి!




విమాన ప్రయాణికులకు ఊరటనిచ్చేలా విమానాల్లో కనీసం 60 శాతం సీట్లను ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా ప్రయాణికులకు కేటాయించాలన్న ఉత్తర్వులను కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. సాధారణంగా విమానాల్లో నచ్చిన సీటును ఎంచుకోవాలంటే ప్రయాణికులు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. దీనిపై ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో, ప్రభుత్వం స్పందించి ప్రతి విమానంలో 60 శాతం సీట్లను ఉచితంగా అందుబాటులో ఉంచాలని ఎయిర్‌లైన్స్ సంస్థలను ఆదేశించింది. మిగిలిన 40 శాతం సీట్లకు మాత్రమే ఛార్జీలు వసూలు చేయాలని సూచించింది. ప్రభుత్వ నిర్ణయంపై విమానయాన సంస్థల సమాఖ్య, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. 60 శాతం సీట్లను ఉచితంగా ఇస్తే తమ ఆదాయం భారీగా తగ్గుతుందని, నిర్వహణ ఖర్చులు పెరిగిపోతాయని ఎయిర్‌లైన్స్ వాదించాయి. ఈ నిబంధనలతో టికెట్ ధరల రూపకల్పనలో సమతుల్యత దెబ్బతింటుందని ప్రభుత్వానికి విన్నవించాయి. ఈ క్రమంలోనే ఎయిర్‌లైన్స్ విన్నపాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఆ ఉత్తర్వుల అమలును ప్రస్తుతానికి పక్కన పెట్టింది. దీనిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నారు. అప్పటి వరకు పాత నిబంధనలే అమలులో ఉంటాయి. అంటే, విమానాల్లో కేవలం 20 శాతం సీట్లు మాత్రమే ఉచితంగా లభించే అవకాశం ఉంది. మిగిలిన సీట్లకు ఎయిర్‌లైన్స్ నిర్ణయించిన ధరల ప్రకారం ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది.

## గోధుమ రవ్వ వెజిటబుల్ ఊతప్పం



ఉదయం టిఫిన్స్ లో గోధుమ రవ్వ వెజిటబుల్ ఊతప్పం తినడానికి మంచి రుచిని ఇస్తుంది. అయితే, సరైన కొలతలతో వండితే అదిరిపోతోంది. ఇలా చేసి కొబ్బరి చట్నీతో తింటే రుచి అదుర్స్. కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు గోధుమ రవ్వ, ఒక కప్పు పెరుగు, రెండు గ్లాస్ ల నీళ్లు , ఒక పెద్ద ఉల్లిపాయ, రెండు టొమాటోలు, 4 పచ్చిమిర్చి , 6 కరివేపాకు ఆకులు , అర కట్ట కొత్తిమీర, క్యారెట్ , రుచికి తగినంత ఉప్పు, నూనెను తీసుకోవాలి. గోధుమ రవ్వ వెజిటబుల్ ఊతప్పం ఎలా తయారు చేయాలంటే? ముందుగా ఒక గిన్నె తీసుకుని దానిలో ఒక కప్పు గోధుమ రవ్వ, ఒక కప్పు పెరుగు, రుచికి సరిపడా ఉప్పు, తగినంత నీరు పోసి దోసె పిండి లాగా జోరుగా కలుపుకోవాలి. ఇలా ఒక అర్ధ గంట పాటు దీనిని నానబెట్టాలి. కూరగాయలను రెడీ చేసుకోవాలి: ఈ గోధుమ రవ్వ మిశ్రమంలో ఒక కప్పు తరిగిన ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, క్యారెట్ తురుము, కొత్తిమీరను వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి. పిండి మరీ జోరుగా ఉండేలా కలపకండి. ఊతప్పంలా వేయాలి: ఇక ఇప్పుడు గ్యాస్ స్టవ్ వెలిగించి దోసె పెనం పెట్టి దాని మీద ఆయిల్ వేసి పిండిని పోసి గుండ్రంగా చేసుకోవాలి. ఊతప్పంలా కావాలి కాబట్టి కొంచం మందంగా వేసుకోవాలి. మూత పెట్టి మీడియం మంటపై 5 నిమిషాలు కాల్చాలి. ఊతప్పం బంగారు రంగులోకి మారే వరకు ఉంచి రెండు వైపులా బాగా కాల్చుకోవాలి.

## వేడి నుంచి ఉపశమనానికి చల్లని నీళ్లు తాగుతున్నారా?



ఎండ, చెమటతో అలసిపోయిన వారికి చల్లటి నీళ్లు తక్షణ చల్లదనాన్ని, ఉపశమనాన్ని అందిస్తుంది. అందువల్ల చాలా ఇళ్లలో ఫ్రిజ్ నీళ్లు లేదా ఐస్ వాటర్ తాగేందుకు ఇష్టపడతారు. అయితే ప్రతి అలవాటు శరీరంపై వివిధ రకాలుగా ప్రభావం చూపుతుందని మనం మర్చిపోకూడదు. చల్లటి నీళ్లు కూడా దీనికి మినహాయింపు కాదు. కొంతమందికి పదేపదే చల్లటి నీళ్లు తాగే అలవాటు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది చల్లటి నీళ్లు తాగడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఎండ, చెమటతో అలసిపోయిన వారికి చల్లటి నీళ్లు తక్షణ చల్లదనాన్ని, ఉపశమనాన్ని అందిస్తుంది. అందువల్ల చాలా ఇళ్లలో ఫ్రిజ్ నీళ్లు లేదా ఐస్ వాటర్ తాగేందుకు ఇష్టపడతారు. అయితే ప్రతి అలవాటు శరీరంపై వివిధ రకాలుగా ప్రభావం చూపుతుందని మనం మర్చిపోకూడదు. చల్లటి నీళ్లు కూడా దీనికి మినహాయింపు కాదు. కొంతమందికి పదేపదే చల్లటి నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. ముఖ్యంగా వాతరణం వేడిగా ఉన్నప్పుడు హఠాత్తుగా చల్లటి నీళ్లు తాగడం వల్ల ప్రయోజనాల కంటే సమస్యలే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు పెరగడానికి కూడా దారితీయవచ్చు. కాబట్టి చల్లటి నీరు తాగడం వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో ఇక్కడ తెలుసుకుందాం..

నిపుణుల అభిప్రాయం ప్రకారం చల్లటి నీళ్లు తాగడం జీర్ణక్రియను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం, కడుపులో భారంగా ఉండటం, గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తవచ్చు. అంతేకాకుండా చల్లటి నీళ్లు గొంతులో గరగర కలిగించవచ్చు. ముఖ్యంగా శరీరం వేడిగా ఉండే వేసవిలో ఇలా ఒకేసారి చల్లటి నీళ్లు తాగడం వలన శరీర ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పు వస్తుంది. కొంతమందికి తలనొప్పి లేదా అలసట కూడా కలిగిస్తుంది. అంతేకాదు ఇది రక్త ప్రసరణను కూడా ప్రభావితం చేస్తుంది. నిరంతరం చల్లటి నీళ్లు తాగే అలవాటు శరీర సహజ ప్రక్రియలను నెమ్మదింపజేస్తుంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఐస్ లేదా మరీ చల్లని నీళ్లు తాగడం మంచిది కాదు. ఎండ నుంచి ఇంటికి లేదా బయటకు వచ్చిన వెంటనే చల్లని నీళ్లు తాగకూడదు. కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత నీళ్లు తాగాలి. ఒకేసారి కాకుండా రోజంతా కొద్దికొద్దిగా నీళ్లు తాగాలి. గొంతు నొప్పి లేదా ఇతర సమస్యలు ఉంటే చల్లటి నీళ్లు తాగవద్దు.

## హఠాత్తుగా బరువు తగ్గుతున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. అయితే, ఈ క్రమంలో చాలామంది సోషల్ మీడియాలో కనిపించే 'క్రాష్ డైట్స్' లేదా 'షార్ట్‌కట్' పద్ధతులను నమ్మి అతి తక్కువ సమయంలోనే ఎక్కువ బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్నారు. పైకి ఇది మంచి ఫలితమే అనిపించినా, లోలోపల మన శరీరంలోని కీలక అవయవాలైన కిడ్నీలు, లివర్‌పై ఇది తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. కానీ ఎటువంటి శారీరక శ్రమ లేకుండా, కేవలం ఆహారం మానేసి లేదా సప్లిమెంట్స్ వాడి వేగంగా బరువు తగ్గడం వల్ల శరీరంలోని అంతర్గత వ్యవస్థ దెబ్బతింటుంది. బరువు తగ్గడం అంటే ఆహారం మానేయడం కాదు, సరైన ఆహారం తీసుకోవడం. రోజుకు 3-4 లీటర్ల నీరు తాగడం, 7-8 గంటల నిద్ర, క్రమం తప్పకుండా 30 నిమిషాల నడక ఉంటే ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ సాధ్యమవుతుంది.శరీరం కేలరీల కొరతను ఎదుర్కొన్నప్పుడు, అది కేవలం కొవ్వునే కాకుండా కండరాలను కూడా శక్తి కోసం కరిగించేస్తుంది. దీనివల్ల శరీరం లోపల బలహీనపడిపోతుంది.హఠాత్తుగా ఆహారం మానేయడం వల్ల శరీరంలోని వ్యర్థాలను శుద్ధి చేసే క్రమంలో కాలేయం, మూత్రపిండాలపై భారం పెరుగుతుంది. ఇది దీర్ఘకాలిక అవయవ వైఫల్యానికి దారితీయవచ్చు.కేలరీలు ఒక్కసారిగా తగ్గితే శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత దెబ్బతింటుంది. ఇది గుండె లయలో మార్పులకు దారితీసి ప్రాణాపాయం కలిగించవచ్చు.విపరీతమైన డైటింగ్ వల్ల పిత్తాశయంలో రాళ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. వేగంగా బరువు తగ్గడం వల్ల జీవక్రియ వేగం తగ్గిపోతుంది. దీనివల్ల డైట్ ఆపగానే మళ్ళీ కోల్పోయిన బరువు కంటే రెట్టింపు బరువు పెరిగే అవకాశం ఉంటుంది.దీనివల్ల నిరంతరం అలసట, నీరసం, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.జుట్టు రాలడం, చర్మం పాలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మాయోక్లినిక్ నివేదిక ప్రకారం, వారానికి 0.5 నుంచి 1 కిలోగ్రాము బరువు తగ్గడం అనేది అత్యంత సురక్షితమైన పద్ధతి. దీనికోసం ప్రతిరోజూ తీసుకునే కేలరీల సంఖ్యను 500-1000 వరకు తగ్గించి, వ్యాయామాన్ని జోడించాలి.

# పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?



బరువు తగ్గాలనుకునే వారు తరచుగా ఎదుర్కొనే ప్రశ్న నడక మంచిదా లేక పరుగు మంచిదా?. ఈ రెండూ అద్భుతమైన కార్డియో వ్యాయామాలే అయినప్పటికీ, శరీర తీరును బట్టి వాటి ఫలితాలు మారుతుంటాయి. ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్.మీ శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. కేలరీల ఖర్చు: సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక. పొట్ట కొవ్వుపై ప్రభావం : పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది. ఎవరికి ఏది మంచిది?: నడక: వయసు పైబడిన వారు, అధిక బరువు ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. పరుగు: వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది. జాగింగ్ లబ రన్నింగ్: రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు. ముఖ్యమైన చిట్కాలు: ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 30-45 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి.

వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. మీరు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. మీ లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.

# ఎండాకాలంలో సోంపు తింటే ఏమవుతుంది..?



వేసవిలో ఎండలు పెరుగుతున్న కొద్దీ మన శరీరంలో వేడి, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు కూడా పెరుగుతుంటాయి. అయితే ప్రతి చిన్న సమస్యకు డాక్టర్ దగ్గరికి వెళ్లి మందులు వాడాల్సిన అవసరం లేదని మీకు తెలుసా? మన వంటగదిలో ఉండే ఒకే ఒక్క వస్తువుతో మీ కడుపును మంచులా చల్లబరచవచ్చు. భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి కాలం ప్రారంభంతో పాటే అనేక ఆరోగ్య సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా ఎండల తీవ్రత వల్ల కడుపులో వేడి, గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు సామాన్యులను వేధిస్తున్నాయి. అయితే ప్రతి చిన్న సమస్యకు మందుల మీద ఆధారపడకుండా మన వంటగదిలోని సోంపు గింజలతో వీటికి సులభంగా పరిష్కారం చూపవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. సోంపు శరీరంలోని పైత్య దోషాన్ని సమతుల్యం చేస్తుంది. ఇది చలువ చేసే గుణం కలిగి ఉండటం వల్ల వేసవి ఉష్ణోగ్రతల నుండి శరీరాన్ని కాపాడుతుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద నివేదికల ప్రకారం.. సోంపులో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్,

సహజ సిద్ధమైన నొప్పి నివారణ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. భోజనం తర్వాత ఒక చెంచా సోంపు నమలడం వల్ల లాలాజలం ఉత్పత్తి పెరిగి జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. భారీగా తిన్నప్పుడు కలిగే అజీర్ణం, కడుపు భారంగా అనిపించే సమస్య నుండి ఇది తక్షణ ఉపశమనం ఇస్తుంది. గ్యాస్ ఉబ్బరం నుండి విముక్తి: కడుపులో గ్యాస్ నిండి ఉబ్బరంగా అనిపించినప్పుడు సోంపు నీరు తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది ప్రేగుల పనితీరును క్రమబద్ధీకరించి, మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. కడుపు నొప్పి నివారణ: సోంపులోని యాంటీ బాక్టీరియల్ గుణాలు సాధారణ కడుపు నొప్పిని తగ్గించడమే కాకుండా నెలసరి సమయంలో వచ్చే తీవ్రమైన కడుపు నొప్పి, అసౌకర్యం నుండి కూడా ఉపశమనం కలిగిస్తాయి.అలసటను తరిమికొట్టే సోంపు టీ: వేసవిలో వచ్చే నీరసం, ఆఫీసు పని వల్ల కలిగే అలసటను తగ్గించడానికి సోంపు టీ అద్భుతంగా పనిచేస్తుంది. ఇది మనస్సును, శరీరాన్ని ప్రశాంతంగా ఉంచి రీఫ్రెష్ చేస్తుంది.

# ఖాళీ కడుపుతో అరటిపండు తింటే ఏమవుతుంది?



మనందరికీ అందుబాటులో ఉండే సూపర్ ఫుడ్ అరటిపండు. తక్షణ శక్తి కోసం, ఆకలి తీర్చుకోవడం కోసం చాలామంది ఉదయాన్నే ఖాళీ కడుపుతో అరటిపండు తినేస్తుంటారు. అయితే అమృతంలాంటి ఈ పండును ఖాళీ కడుపుతో తింటే అది మీ గుండెపై ప్రభావం చూపుతుందని మీకు తెలుసా? అసలు అరటిపండును ఏ సమయంలో తింటే ఆరోగ్యం? ఖాళీ కడుపుతో తింటే వచ్చే నష్టాలేంటి? తక్షణ శక్తినిచ్చే పండ్లలో అరటిపండు మొదటి వరుసలో ఉంటుంది. అందుకే చాలా మంది ఉదయం జిమ్‌కు వెళ్లాలన్నా లేదా ఆఫీస్ హడావిడిలో ఆకలి వేసినా వెంటనే అరటిపండు తినేస్తుంటారు. అయితే ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ పండును చాలా మంది ఖాళీ కడుపుతో తింటారు. ఇలా తినడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ః6, పీచు పదార్థం పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర చడమే కాకుండా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడ తాయి. అయితే ఇందులో ఉండే సహజ చక్కెరలు ఖాళీ కడుపుతో తిన్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచి, ఆ తర్వాత అంతే వేగంగా తగ్గించేస్తాయి. దీనివల్ల కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేయడం లేదా విపరీతమైన అలసట రావడం జరుగుతుంది. గుండె ఆరోగ్యంపై ప్రభావం: అరటిపండులో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో మెగ్నీషియం, కాల్షియంల మధ్య సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే ఇందులో ఉండే ఆమ్ల స్వభావం వల్ల కొందరిలో గ్యాస్, కడుపు ఉబ్బరం లేదా గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తవచ్చు. అరటిపండును నేరుగా ఖాళీ కడుపుతో తినడం కంటే ఇతర ఆహార పదార్థాలతో కలిపి తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండు ముక్కలను పెరుగులో లేదా ఓట్స్ లో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి కావలసిన ప్రోటీన్ అందుతుంది. అలాగే పండులోని ఆమ్లత్వం తగ్గుతుంది.

బాదం లేదా వాల్‌నట్స్‌తో కలిపి తినడం వల్ల శరీరానికి పోషకాలు నెమ్మదిగా అందుతాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత అరటిపండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఏదైనా సరే పరిమితంగా, సరైన సమయంలో తీసుకున్నప్పుడే అది ఔషధంలా పనిచేస్తుంది.

# ఎండాకాలంలో ఏ పిండి రొట్టె తినడం ఆరోగ్యానికి మంచిది?

సెగలు గక్కుతున్న ఎండలతో బాడీ హీట్ పెరిగిపోతుందా? అయితే మీ వంటింట్లో చిన్న మార్పు చేయాల్సిన సమయం వచ్చేసింది. మనం రోజూ తినే గోధుమ రొట్టె కంటే, వేసవిలో అమృతంలా పనిచేసే కొన్ని ప్రత్యేక రొట్టెలు ఉన్నాయని మీకు తెలుసా? ప్రముఖ మాస్టర్ చెఫ్ పంకజ్ భదౌరియా వేసవి తాపం నుంచి తప్పించుకోవడానికి ఇచ్చిన అద్భుతమైన సలహాలు. మార్చిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పెరుగుతున్న వేడి దృష్ట్యా, ప్రజలు తమ ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ సీజన్‌లో ఏ రొట్టె తినాలి: సాధారణంగా అందరూ ఏడాది పొడవునా గోధుమ రొట్టెనే తింటారు. కానీ వాతావరణాన్ని బట్టి ధాన్యాలను మార్చడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని పంకజ్ భదౌరియా సూచించారు. వేసవిలో బార్లీ రొట్టె అమృతంతో సమానం. ఇది శరీరాన్ని చల్లబరచడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగే వారికి, త్వరగా అలసిపోయేవారికి ఇది ఉత్తమ ఎంపిక. రాగిరొట్టెలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇక జొన్న రొట్టె ఏడాది పొడవునా తినవచ్చు. ఇందులో ఉండే పీచు పదార్థం కడుపును తేలికగా ఉంచుతుంది. అయితే చలికాలంలో మేలు చేసే మొక్కజొన్న, సజ్జ రొట్టెలకు వేసవిలో దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే ఇవి శరీరంలో వేడిని పెంచుతాయి. వేసవిలో కేవలం నీళ్లు తాగడం మాత్రమే సరిపోదు. ఆహారంలో నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను చేర్చుకోవాలి. పుచ్చకాయ, కర్బూజా, నారింజ, ద్రాక్ష, మామిడి పండ్లు శరీరానికి అవసరమైన విటమిన్లను, తేమను అందిస్తాయి. దోసకాయ, సొరకాయ, పాలకూర వంటివి సులభంగా జీర్ణమై శరీర వేడిని తగ్గిస్తాయి. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తుంది. మజ్జిగలో కొంచెం జీలకర్ర పొడి, ఉప్పు కలుపుకుని తాగడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. నిమ్మరసం వడదెబ్బ తగలకుండా రక్షిస్తుంది. వేసవిలో మసాలాలు, నూనె పదార్థాలు, బరువైన ఆహారానికి దూరంగా ఉండాలి. వీలైనంత వరకు కిచిడీ, సలాడ్స్ వంటి తేలికపాటి ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం.

# రెండుసార్లు ఓడినంత మాత్రాన ప్రపంచమేమీ అంతం కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి తర్వాత, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్య రహానే జట్టు సభ్యులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ అంతం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆటగాళ్లకు ధైర్యం చెప్పాడు. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 65 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి రహానే మాట్లాడాడు. ఈ గేమ్‌లో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా పది ఓవర్ల తర్వాత బౌలర్లు అద్భుతంగా పుంజుకుని సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసిన తీరు అద్భుతమని ప్రశంసించాడు. కేకేఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మనం ప్రతిరోజూ ఏం ఆలోచిస్తామనేదే నాకు ముఖ్యం. మన ఆటగాళ్ల ప్రయత్నం ప్రశంసనీయం. మీలో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే. ఏ పరిస్థితిలోనైనా జట్టును గెలిపించగల సత్తా మీకుంది. ఆ నమ్మకాన్ని కోల్పోవద్దు" అని రహానే పేర్కొన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో తొలి బంతి నుంచే బ్యాటర్లు చూపిన పోరాట

పటిమను కూడా కెప్టెన్ మెచ్చుకున్నాడు. "ప్రపంచం మన గురించి ఏమనుకున్నా పట్టించుకోవద్దు. మనపై మనకు నమ్మకం ఉంటే చాలు" అని రహానే స్పష్టం చేశాడు. కాగా, కేకేఆర్ చరిత్రలో ఒక సీజన్‌ను వరుసగా రెండు ఓటములతో ప్రారంభించడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. కేకేఆర్ తన తర్వాతి మ్యాచ్‌లను ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

# సన్‌రైజర్స్ కెప్టెన్సీపై చర్చ.. నాకు కూడా ఇలాగే జరిగిందంటూ ధోనీ విషయాన్ని గుర్తుచేసిన యువీ!






ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. చాలాకాలంగా జట్టుతో కొనసాగుతున్న యువ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని అందరూ భావించినప్పటికీ, ఫ్రాంచైజీ యాజమాన్యం ఇషాన్ వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయం పట్ల టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ తన అసంతృప్తిని, నిరాశను బహిరంగంగా వ్యక్తం చేశాడు. అభిషేక్ శర్మకు కొన్నేళ్లుగా నెట్స్‌లో శిక్షణ ఇస్తున్న యువరాజ్ సింగ్, అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైంది కాదన్నాడు. స్పోర్ట్స్ తక్‌తో యువీ మాట్లాడుతూ... "ఈ నిర్ణయం నన్ను కాస్త నిరాశపరిచింది. ఇషాన్ కిషన్ ఎదుగుదల అంటే నాకూ ఇష్టమే. కానీ, ఒక ఆటగాడి కోణంలో ఆలోచించండి. అభిషేక్ శర్మ ఏడేళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి తన సర్వస్వాన్ని అందిస్తున్నాడు. తన రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ, ఆ జట్టును గెలిపించాడు. అలాంటి ఆటగాడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వకపోతే, అతను ఎలాంటి మానసిక స్థితితో ఆడతాడు?" అని యువరాజ్ ప్రశ్నించాడు. అయితే, ఇషాన్, అభిషేక్ మధ్య మంచి స్నేహం ఉండటం ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఈ సందర్భంగా యువరాజ్ తన కెరీర్‌లోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. "2007లో భారత జట్టులో నేను వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి సీనియర్లు ఉన్నారు. కానీ, ఎక్కడి నుంచో వచ్చి ఎంఎస్ ధోనీ కెప్టెన్ అయ్యాడు. దానికి కారణాలు ఏవైనా కావచ్చు. కొందరి తలరాతలో నాయకుడిగా ఎదగాలని రాసిపెట్టి ఉంటుంది. కానీ, ఏళ్ల తరబడి జట్టు కోసం కష్టపడిన వారికి అవకాశం రానప్పుడు ఆటగాడిగా నిరాశ కలగడం సహజం" అని వివరించాడు. ఫ్రాంచైజీ నిర్ణయంతో తాను ఏకీభవించలేనని, అయితే ఇప్పుడు నిర్ణయం జరిగిపోయిందని యువరాజ్ అన్నాడు. "రేపు హైదరాబాద్ గెలిస్తే నా మాటలు తప్పని నిరూపితం కావచ్చు. కానీ, నా అభిప్రాయం ప్రకారం వారి బౌలింగ్ చాలా బలహీనంగా ఉంది. నాయకుడిగా ఎదిగేందుకు ఐపీఎల్ గొప్ప వేదిక. అభిషేక్‌కు ఆ అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఏదేమైనా ఈ నిరాశను పక్కనపెట్టి, కెప్టెన్‌కు మద్దతు ఇస్తూ, జరిగిన అవమానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ఆడాలని అభిషేక్‌కు చెప్పాను" అని యువీ చెప్పుకొచ్చాడు.

# పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు: లాస్ట్ 7 మ్యాచుల్లో అయ్యర్ సేనదే హవా



ఐపీఎల్ 19లో భాగంగా శుక్రవారం (ఏప్రిల్ 3) చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తలపడనున్నాయి. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా ఈ ఆసక్తికర పోరు జరగనుంది. టోర్నీని ఓటమితో ఆరంభించిన చెన్నై సూపర్ కింగ్స్ సొంత గడ్డపై విజయంతో బోణీ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు గుజరాత్?పై ఆల్ రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ ఘనంగా టోర్నీని ఆరంభించింది. ఇవాళ్టి మ్యాచులో గెలుపు కోసం ఇరు జట్లు ఉత్సుకతతో ఉన్నాయి. ఇదిలా ఉంటే ఐపీఎల్?లో పంజాబ్, చెన్నై ఇప్పటి వరకు ఎన్నిసార్లు తలపడ్డాయి.. టోర్నీలో ఎవరిది పైచేయి అనే విషయం తెలుసుకుందాం.

**పంజాబ్, చెన్నై హెడ్ టూ హెడ్ రికార్డులు:**

క్యాచ్ రిచ్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఇప్పటి వరకు 32 సార్లు తలపడ్డాయి. ఇందులో చెన్నై, పంజాబ్ చెరో 16 మ్యాచుల్లో విజయం సాధించి సమఉజ్జీవులుగా ఉన్నాయి.

అయితే, చివరి 7 మ్యాచులను పరిశీలిస్తే మాత్రం పూర్తిగా పంజాబ్?దే ఆధిపత్యం. చివరి ఏడు మ్యాచుల్లో పంజాబ్ ఆరుసార్లు గెలవగా.. చెన్నై ఒక మ్యాచులో మాత్రమే విజయం సాధించింది. టోర్నీలో అత్యధిక టైటిల్స్ గెలిచిన చెన్నైను ఈ చెత్త రికార్డ్ కలవరపాటుకు గురి చేస్తోంది. మరోవైపు చెన్నైపై ఇవాళ్టి మ్యాచులో కూడా విజయం సాధించి తమ హవా కొనసాగించాలని పంజాబ్ భావిస్తోంది.

**ఎంఏ చిదంబరం స్టేడియం పిచ్ రిపోర్ట్:**

ఎంఏ చిదంబరం స్టేడియం సాధారణంగా బ్యాటింగ్?కు అనుకూలం. ఈ పిచ్?లో యావరేజ్ స్కోర్ 173. బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకుంటే 200 నుంచి 230 పరుగులు చేయడం పెద్ద కష్టమేమీ కాదు. దీన్నిబట్టి చూస్తే ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమనే విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. దీంతో ఈ గేమ్‌లో భారీగా పరుగుల వరద పారే ఛాన్స్ ఉంది. ఇక మ్యాచ్ సాగుతున్న కొద్దీ మంచు (ఐవష) ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన టీమ్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది.

## కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్



# కథలపై బాలయ్య ఫోకస్ మారిందా?



నందమూరి బాలకృష్ణ తన తర్వాతి సినిమాల విషయంలో రూటు మారుస్తున్నారు. వరుసగా కుర్ర దర్శకులతో సినిమాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సక్సెస్ కాంబినేషన్స్ కంటే ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కంటెంట్ ఉన్న కుర్ర మేకర్స్ కోసం ఫోకస్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నందమూరి బాలకృష్ణ ప్రయోగాలు చేయడానికి సిద్ధంగానే ఉన్నా ఆ రేంజ్ కు తగ్గట్టు కథలు సిద్ధం చేసే వారు తక్కువ.

ఇక ప్రస్తుతం కొత్త కాంబినేషన్స్ పై రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సరిపోదా శనివారం దర్శకుడు వివేకా ఆత్రేయతో ఒక క్రైమ్ థ్రిల్లర్ కథపై చర్చలు జరుపుతున్నట్లు టాక్ వచ్చింది. ఈ దర్శకుడు రజినీకాంత్ తరువాత మళ్ళీ బాలయ్యపై ఫోకస్ పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు 'నాంది' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న విజయ్ కనకమేడల, రీసెంట్ గా బాలయ్యను కలిసి ఒక పవర్‌ఫుల్ పోలీస్ స్టోరీ వినిపించినట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది.బాలయ్యకు పోలీస్ డ్రెస్ వేయడమంటే మామూలు విషయం కాదు, అందులోనూ విజయ్ తీసే సినిమాలు చాలా సీరియస్ గా, రఫ్ గా ఉంటాయి కాబట్టి ఈ కాంబినేషన్ మీద క్లారిటీ రాకముందే అంచనాలు పెరిగిపోతున్నాయి. ?అయితే విజయ్ అల్లరి నరేష్ తో తీసిన సినిమా 'నాంది' సూపర్ హిట్ అయినా, ఆ తర్వాత వచ్చిన 'ఉగ్రం' మాత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దీంతో ఈ యంగ్ డైరెక్టర్ ఇప్పుడు బాలయ్య లాంటి పెద్ద హీరోను ఎలా హ్యాండిల్ చేస్తారో అన్న అనుమానాలు కొందరిలో ఉన్నాయి. కానీ విజయ్ దగ్గర మంచి కంటెంట్ ఉంటే మాత్రం బాలయ్య లాంటి మాస్ హీరో దొరికితే అది ఖచ్చితంగా వెండితెరపై ఒక రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు.?మరోవైపు బాలకృష్ణ కూడా ఇప్పుడు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. భారీ అంచనాలతో వచ్చిన 'అఖండ 2' అంతగా వర్కవుట్ కాలేదు. దీంతో కేవలం బిల్డప్ సీన్లు మాత్రమే ఉంటే సరిపోదని, కథలో దమ్ముండాలని బాలయ్య ఫిక్స్ అయ్యారు. అందుకే విజయ్ కనకమేడల చెప్పిన ఆ సీరియస్ పోలీస్ డ్రామా బాలయ్యకు నచ్చిందని, అందుకే ఈ ప్రాజెక్ట్ ఓకే అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. రొటీన్ మాస్ మసాలా కాకుండా ఏదైనా కొత్తగా ట్రై చేయాలనేది బాలయ్య ప్లాన్ కావొచ్చు.

?ప్రస్తుతానికి ఇది ఇండస్ట్రీలో నడుస్తున్న ఒక టాక్ మాత్రమే. ఇంకా అఫీషియల్ గా ఏమీ అనౌన్స్ చేయలేదు. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్ అయితే మాత్రం బాలయ్యను మరోసారి పవర్‌ఫుల్ పోలీస్ గెటప్‌లో చూడొచ్చు. విజయ్ కనకమేడల తన మార్క్ సీరియస్ కథతో బాలయ్యను ఏ రేంజ్ లో చూపిస్తారో అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ యంగ్ డైరెక్టర్ బాలయ్యను మెప్పించి షూటింగ్ మొదలుపెడతారో లేదో వేచి చూడాలి.

## శివంగి వర్మ సొగసైన లుక్స్



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965